
# మరణానంతరం జరిగేది-3

రచన : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



# మరణానంతరం జరిగేది-3



రచన & ప్రచురణ: బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు, B.Sc.,

మొదటి ముద్రణ : ఆగస్టు, 2026
ప్రతులు : 1,000

**వెల : రూ. 60/-**

**పుస్తకముల కొరకు :-**

## తటవర్తి వీరరాఘవరావు,

**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.**

**సెల్ : 94901 71853, 9440309812**

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) ఆత్మ పరిణామక్రమం | - | రూ.70/- |
| 11) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 12) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 13) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 14) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 15) పంచకోశాలు | - | రూ.60/- |
| 16) మనస్సు యొక్క స్థితులు | - | రూ.60/- |
| 17) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 18) జీవితం ధన్యం చేసుకోవాలంటే? | - | రూ.60/- |
| 19) జన్మరాహిత్య స్థితికి మార్గం | - | రూ.60/- |
| 20) ఆత్మగా జీవించ లేకపోవడానికి కారణాలు | - | రూ.60/- |
| 21) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 22) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 23) చిత్తం శాంతిగా వుండాలంటే? | - | రూ.50/- |
| 24) విషయ కర్మలు-శ్రేయోకర్మలు | - | రూ.50/- |
| 25) బాహ్య మౌనం - అంతర్ మౌనం | - | రూ.50/- |
| 26) అహంకారం ఎలా పోతుంది | - | రూ.50/- |
| 27) మానవుల్లో అసంతృప్తికి కారణం | - | రూ.50/- |
| 28) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 29) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |

# “తాను చేసే కర్మలను బట్టి తాను పొందే లోకాలు ఉంటాయని తెలుస్తుంది”.

సహజంగా చనిపోయిన తర్వాత ఎవరినైనా సరే సహాయకులు వచ్చి ఆత్మలను పై లోకాలకు తీసుకెళ్తారు, అది కూడా వారి అంగీకారంతోనే తీసుకెళ్తారు. అలా తీసుకువెళ్ళిన తర్వాత, “ఇప్పుడు నన్ను ఎక్కడికి తీసుకెళ్తారు?” అని చనిపోయిన వ్యక్తి అడుగుతాడు. అప్పుడు వారు, **“ఏమీ లేదు బాబూ, నువ్వు జీవితంలో చేసిన కర్మలను బట్టి ఇప్పుడు నువ్వు తీసుకు వెళ్ళబడే లోకం ఆధారపడి ఉంటుంది”** అని చెబుతారు.

అప్పుడు అతనికి అర్థమవుతుంది, “ఓహో! నేను జీవించి ఉండగా చేసిన కర్మలను బట్టే నేను తీసుకువెళ్ళబడే లోకాలు ఆధారపడి ఉంటాయన్న మాట” అని అనుకుంటాడు. మరి జీవితంలో ప్రతిరోజూ ఎన్నో కర్మలు చేస్తున్నాను, కానీ ఇప్పటివరకు వాటి గురించి నేను ఆలోచించలేదేమిటి? అసలు చనిపోయిన తర్వాత నేను ఉంటానన్న సంగతే నాకు తెలియదు. అంతేకాదు, చనిపోయిన తర్వాత నేను భూమిపై చేసిన కర్మలను బట్టి నన్ను ఎక్కడికి తీసుకెళ్తారు, నేను ఎక్కడికి తీసుకువెళ్ళబడతాను అన్నది ఆధారపడి ఉందా అని అతనికి తెలుస్తుంది.

ఎందుకంటే, ఎవరైనా చనిపోతే కర్మకాండలు చేస్తారు. ఆ కర్మకాండలు చేసేటప్పుడు అక్కడి బ్రాహ్మణులను అడిగితే, అప్పుడు వారు “ఏమీ లేదు బాబూ, ఈ కర్మకాండలు చేయడం వల్ల, ఈ పిండాలు పెట్టడం వల్ల, ఈ దానాలు చేయడం వల్ల మీ తండ్రి గారు ఉన్నత లోకాలకు తీసుకు వెళ్ళబడతారు అని చెబుతారు. అప్పుడు వారు “ఓహో! మనం ఎలా జీవించినా, ఆఖరులో మన పిల్లలు చేసే కర్మకాండలను బట్టే చనిపోయిన వారు వెళ్లబడే లోకాలు ఆధారపడి ఉంటాయన్న మాట” అనే అవగాహనలో ఉండేవాడు.

కానీ పై లోకాలకు వెళ్ళిన తర్వాత పరిస్థితి దానికి పూర్తి విరుద్ధంగా ఉంటుంది. అక్కడ ఆ సహాయకులు ఏమి చెప్పారంటే, “నువ్వు చేసిన కర్మలను బట్టే నువ్వు తీసుకువెళ్లబడే లోకాలు ఆధారపడి ఉంటాయి కానీ నీ వాళ్ళు పెట్టే పిండాలను బట్టి, వారు చేసే కర్మకాండలను బట్టి నువ్వు తీసుకువెళ్లబడే లోకాలు ఆధారపడవు” అని చెబుతారు. అప్పుడు అతనికి స్పష్టంగా అర్థమవుతుంది. జీవించి ఉన్నప్పుడు తాను చేసిన కర్మలే తన భవిష్యత్తు గమ్యాన్ని నిర్ణయిస్తాయని, అతనికి స్పష్టమైన అవగాహన కలుగుతుంది.

ఆ తర్వాత అతను అక్కడ కొన్నాళ్ళు ఉంటాడు. అనంతరం జనా లోకానికి తీసుకువెళ్లబడతాడు, అక్కడ కౌన్సిలింగ్‌లు జరుగుతాయి. ఆ ఊర్ధ్వ లోకాల నుంచి వచ్చిన వారు కౌన్సిలింగ్ లు చేస్తారు. అప్పుడు వారిని అడుగుతాడు, “ఏవండీ! భూమ్మీద మాకు కర్మకాండలు చేస్తే గొప్ప లోకాలకు వెళ్తామని చెప్పారు. కానీ నేను అంత గొప్ప లోకానికి వెళ్ళలేదు ఎందుకు?”

అప్పుడు వారు, “నువ్వు చేసిన కర్మలను బట్టే నువ్వు తీసుకువెళ్ల బడతావయ్యా” అని చెబుతారు. మరి “నేను గొప్ప లోకాలకు వెళ్ళాలంటే ఏం చేయాలి? ఎటువంటి పనులు చేయాలి?” అని వారిని అడుగుతాడు. అప్పుడు వారు, **“బాబూ! నువ్వు పాపాలు చేస్తే భువర్లోకానికి వెళ్తావు, పుణ్యాలు చేస్తే సువర్లోకానికి తీసుకువెళ్లబడతావు”.** నువ్వు భువర్లోకం చేరుకున్నా, సువర్లోకం చేరుకున్నా కొన్నాళ్ల తర్వాత జనా లోకానికి వస్తావు. ఇక్కడ లాగే కౌన్సిలింగ్‌లు జరుగుతాయి. మా లాంటి వాళ్ళు వచ్చి నీ సందేహాలను నివృత్తి చేస్తూ ఉంటాము” అని చెబుతారు. అప్పుడు అతను, “మరి నేను ఇంకా గొప్ప లోకాలకు వెళ్లాలంటే ఏం చేయాలి?” అని అడుగుతాడు. అప్పుడు వారు, “నాయనా! ఈ జనాలోకం పైన ఇంకా చాలా గొప్ప లోకాలు ఉన్నాయి. మహాలోకం, తపోలోకం వున్నాయి. కానీ నువ్వు చివరకు చేరుకోవాల్సిన సత్యలోకం కూడా ఉంది.

ఈ లోకాలకు వెళ్లాలంటే పాప కర్మలు, పుణ్య కర్మలు చేయడం వల్ల అవకాశం వుండదు. ఎవరైతే భూమ్మీద ఉన్నప్పుడు "ధ్యానం చేసి జ్ఞానం సంపాదించుకుంటారో, వారికి మాత్రమే ఈ జనా లోకాన్ని దాటి ఉన్న గొప్ప లోకాలను చేరుకునే అవకాశం ఉంటుంది". మేము కూడా అటువంటి లోకాల నుంచే వచ్చి మీకు కౌన్సిలింగ్‌లు చేస్తున్నాం. మరి ఈ స్థాయికి మీరు రావాలంటే భూమ్మీద ఎంతో ధ్యాన సాధన చేయాలి, జ్ఞానం సంపాదించు కోవాలి. అప్పుడు మీరు ఈ గొప్ప స్థితికి చేరుకుంటారు" అని చెబుతారు. అప్పుడు అతనికి అర్థమవుతుంది. "ఓహో! భూమ్మీదికి వెళ్ళి అక్కడ ధ్యానం చేసి జ్ఞానం సంపాదించినట్లయితే ఇంత గొప్ప లోకాలకు చేరుకుంటామా!" అని తెలుసుకుంటాడు.

అతనికి ఉన్న కొన్ని సందేహాలను అడుగుతాడు. "ఏవండీ! ఆ లోకాలకు వెళ్తే మాకు వచ్చే లాభం ఏమిటి?" అని అడుగుతాడు. అప్పుడు వారు, "ఏమీ లేదు నాయనా! అటువంటి గొప్ప లోకాలను చేరుకున్నప్పుడు అక్కడ ధ్యానం చేసిన వారు, తపస్సు చేసినవారు, గొప్ప సేవలు చేసిన వారు, తపస్సు సంపన్నులు ఇలా ఎంతో మంది పరిచయం అవుతారు. వారి సాంగత్యం లభిస్తుంది. దాని వల్ల నువ్వు ఎన్నో కొత్త విషయాలు తెలుసుకుంటావు" అని చెబుతారు. "ఇంకేంటండి అక్కడ లాభం?" అని మళ్ళీ అడిగితే, అప్పుడు వారు, "ఇంకో గొప్ప ప్రయోజనం ఉంది నాయనా. నువ్వు మళ్ళీ జన్మ తీసుకోవాలని అనుకున్నప్పుడు నీకు ఛాయిస్ ఇవ్వబడుతుంది. ఎటువంటి జన్మ తీసుకోవాలో, ఎవరిని నీ భార్యగా కానీ, భర్తగా కానీ పొందాలో నీకు ఛాయిస్ ఉంటుంది. నీ ఛాయిస్ ప్రకారమే నీకు జన్మ ఇవ్వబడుతుంది" అని చెబుతారు. అప్పుడు అతనికి అర్థమవుతుంది. "ఓహో! నేను ఆ గొప్ప లోకానికి చేరుకుంటే నాకు నచ్చిన జన్మను నేను ఎంచుకోవచ్చున్నమాట" అని.

ఇలా అతను జనా లోకానికి వచ్చాడంటే ఏదో పాప కర్మ లేదా

పుణ్య కర్మ చేసి వచ్చి ఉంటాడు. సరే, ఉన్న పరిస్థితిని బట్టి ఆ కర్మలను అనుసరించి ఎంపిక చేసుకుంటాడు. కానీ అతనికి ఒక అవగాహన వస్తుంది, “ఈసారి నేను భూమ్మీదికి వెళ్లినప్పుడు పాపాలు కానీ, పుణ్యాలు కానీ చేయకుండా ధ్యానం చేసి జ్ఞానం సంపాదిస్తాను, ఆ గొప్ప లోకాలకు చేరుకుంటాను” అని నిర్ణయించుకుంటాడు. అలా నిర్ణయించుకుని, “మరి నేను ఇప్పుడు జన్మ తీసుకోవాలనుకుంటున్నాను. ఎలా?” అని అడుగుతాడు.

అప్పుడు అతనిని ఆకాశిక్ రికార్డుల రూం వద్దకు పంపిస్తారు. అక్కడ ఒక గదిలో అతను గతంలో చేసిన కర్మలన్నీ ఉంటాయి. వాటిలో నుంచి ఎంచుకోమంటారు, అతను ఎంచుకుంటాడు. అతను ఎంచుకున్న కర్మలను బట్టి అతని నాడీమండల శరీరం తయారు చేయబడుతుంది. ఆ తర్వాత దానికి అనుగుణమైన తల్లి గర్భంలో తయారయ్యే శరీరం లభించినప్పుడు, ఆ శరీరంలో అతను ప్రవేశపెట్టబడతాడు. అలా ప్రవేశించిన తర్వాత తల్లి గర్భంలో తొమ్మిది నెలలు పూర్తి చేసుకుని తల్లి శరీరం నుంచి బయటకు వస్తాడు. విచిత్రం ఏమిటంటే, తల్లి గర్భంలో ఉన్నంత సేపూ ఈ విషయాలన్నీ అతనికి గుర్తుంటాయి.

తల్లి గర్భం నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా ఈ విషయాలన్నీ గుర్తుంటాయి. కానీ రోజులు గడిచే కొద్దీ అతను పై లోకాలలో అనుకున్న విషయాలను ఒక్కొక్కటిగా మర్చిపోతూ ఉంటాడు. ఎందుకంటే ఆ కుటుంబంలో తల్లి, తండ్రి, ఇతర కుటుంబ సభ్యులు అతనిని ఆడిస్తూ, పలకరిస్తూ, ఎన్నో విషయాలు చెబుతూ ఈ ప్రపంచ జీవితంలోకి లాక్కొని వస్తారు. ఆ కుటుంబంలో గడిచే కొద్దీ గతమంతా మర్చిపోతాడు. చివరికి తనకు గుర్తుండేది ఒక్కటే. తాను ఏ కుటుంబంలో ఉంటే ఆ కుటుంబానికి చెందిన వాడినే అనుకుంటాడు, వారు ఏ మతంలో ఉంటే తనది కూడా అదే మతం అనుకుంటాడు, వారు ఏ దేశంలో ఉంటే తనది కూడా అదే దేశమని వారు

పేద వారు అయితే తాను పేదవాడినని, వారు ధనవంతులు అయితే తాను ధనవంతుడినని భావిస్తాడు.

ఆ తల్లిదండ్రులు చిన్న వయసులో ఏం చెబితే అది చేస్తూ, ఆ వాతావరణానికి అలవాటు పడిపోతాడు. వారు ఏ మతంలో ఉంటే దానికి అనుగుణంగానే తయారవుతాడు. హిందూ కుటుంబంలో పుడితే "రాముడు నా దేవుడు, కృష్ణుడు నా దేవుడు" అనే భావంలో ఉంటాడు. క్రైస్తవ కుటుంబంలో పుడితే "యేసే నా దేవుడు" అనుకుంటాడు. ముస్లిం కుటుంబంలో పుడితే "అల్లానే నా దేవుడు" అని భావిస్తాడు. అలా ఆ కుటుంబ పరిస్థితులను బట్టి తాను కూడా అలాగే తయారవుతూ ఉంటాడు. మెల్లగా సమాజంలోకి వస్తాడు, స్నేహితులు, బంధువులు, పరిచయస్తులు ఇలా ఎంతో మంది పరిచయం అవుతారు. వారు ఎలా జీవిస్తున్నారో తాను కూడా అలాగే జీవిస్తాడు. వారి అలవాట్లు ఎలా ఉంటాయో తాను కూడా అవే అలవాట్లు చేసుకుంటాడు. వారు మాంసాహారులు అయితే తాను కూడా మాంసాహారం తీసుకుంటాడు. వారు శాకాహారులు అయితే తాను కూడా శాకాహారమే తీసుకుంటాడు.

వారు డబ్బు సంపాదనకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తే, "ఓహో! డబ్బు ఎక్కువ సంపాదిస్తే సమాజంలో ఎక్కువ గౌరవం ఉంటుందన్న మాట" అని భావించి, తాను కూడా బాగా డబ్బు సంపాదించాలని ప్రయత్నిస్తూ రాత్రింబవళ్లు కష్టపడతాడు. ఎంత ఎక్కువ సంపాదిస్తే అంత ఎక్కువ గౌరవం వస్తుందని అనుకుంటూ జీవిస్తాడు. కానీ తాను ఎక్కడి నుంచి వచ్చాడు, దేని కోసం వచ్చాడు, ఏమి సాధించాలనుకున్నాడు, ఏమి సంపాదించుకోవాలనుకున్నాడు అనే విషయాలన్నీ మర్చిపోతాడు. వాస్తవానికి అతను భూమి పైకి వచ్చిన కారణం ఈ శరీరంతో తీవ్ర ధ్యాన సాధన చేసి జ్ఞానాన్ని సంపాదించుకోవడం, ఆ జ్ఞానంతో జనా లోకాన్ని దాటి ఉన్న గొప్ప లోకాలు, ఉన్నత లోకాలను చేరుకోవడం. కానీ విచిత్రం ఏమిటంటే భూమి పైకి వచ్చిన తర్వాత ఆ

విషయాలన్నీ మర్చిపోతాడు.

ఈ విధంగా సుమారు 350 జన్మలు గడిచిన తర్వాత ఒక సద్గురువు పరిచయం అవుతాడు. అప్పుడు అతనిలో చాలా పరివర్తన వస్తుంది. "ఈ పుట్టడం, చావడం, కష్టాలు, బాధలకు అసలు కారణం ఏమిటి?" అనే ప్రశ్నలు కలుగుతాయి. తెలిసిన వారిని అడిగితే బాగుంటుందని భావిస్తూ గురువును వెతుకుతాడు. చివరికి ఒక సద్గురువును ఆశ్రయిస్తాడు. ఆ సద్గురువు ద్వారా ఈ విషయాలన్నీ తెలుసుకుంటాడు. అప్పుడు జన్మ తీసుకున్న తర్వాత మర్చిపోయిన విషయాలు మళ్లీ గుర్తుకు వస్తాయి. "ఓహో! నేను పై లోకాల నుంచి వచ్చాను, ఇంకా గొప్ప లోకాలకు వెళ్లడానికే ఈ భూమిపై జన్మ తీసుకున్నాను. ఇక్కడ సాధన చేసి జ్ఞానాన్ని సంపాదించి, మళ్లీ శరీరాన్ని విడిచినప్పుడు జనా లోకాన్ని దాటి ఉన్న గొప్ప లోకాలకు చేరుకోవాలి" అని అర్థం చేసుకుంటాడు.

అప్పటి వరకు అతని దృష్టి మొత్తం సంపాదన మీదే ఉండేది, వ్యాపారం అయినా, ఉద్యోగం అయినా, ఏదో ఒక వృత్తిని ఎంచుకుని డబ్బు సంపాదనకే ప్రాధాన్యం ఇచ్చేవాడు. కానీ ఎప్పుడైతే సద్గురువు పరిచయం అయ్యాడో, అప్పటి నుంచి సంపాదన మీద దృష్టి తగ్గి, "నాకు కావలసింది ధనం కాదు, జ్ఞానం" అని గ్రహిస్తాడు. గురువు ప్రభావంతో ధన సంపాదనకు ఇచ్చే ప్రాధాన్యాన్ని తగ్గించి, జ్ఞాన సంపాదనకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తాడు. ఈ మార్పు ఎందుకు వచ్చింది అంటే, మరణానంతరం ఏమి జరుగుతుందో సద్గురువు ద్వారా తెలుసుకున్నాడు కాబట్టి. తాను చేసే కర్మలను బట్టే తాను పొందే లోకాలు ఉంటాయని తెలుసుకున్నాడు కాబట్టి.

ఇప్పుడు నా విషయం, మా మేడం విషయం తీసుకుంటే కూడా మా ఇద్దరి జీవితాల్లో జరిగింది ఇదే. పత్రి గారు పరిచయం అయ్యే వరకు సంపాదనే మా ధ్యేయం. పత్రి గారు పరిచయం అయిన తర్వాత అవసరాలకు

సరిపడా సంపాదిస్తే చాలు, అంతకుమించి ఎంత ఉన్నా దండగే అని అర్థం చేసుకున్నాం. అప్పటి నుంచి సంపాదనకు పరిమితమై, జ్ఞాన సంపాదన ప్రారంభించాం, మా లక్ష్యం ఇది కాదని గ్రహించాం. కానీ భూమిపై ప్రతి ఒక్కరూ బాగా సంపాదించి, తాను సంపాదించినదంతా తన పిల్లలకు ఇవ్వాలని భావిస్తారు. కానీ కాస్త జ్ఞానం పెరిగితే అర్థమవుతుంది, పిల్లల కోసం మీరు అధికంగా సంపాదించాల్సిన అవసరం లేదు, వారు ఎదిగిన తర్వాత తమ స్వశక్తితో తామే సంపాదించుకోగలరు అని

మీరు చేయవలసింది మీకు మరియు మీ కుటుంబానికి అవసరమైనంత సంపాదించుకోవడం, మిగిలిన సమయాన్ని జ్ఞాన సంపాదనకు ఉపయోగించడం. ఈ విషయాన్ని గ్రహించినవాడు ఆ దిశగా ప్రయత్నం చేస్తాడు. చాలామంది పిల్లల కోసం ఎంతో కష్టపడి ఆస్తులు సంపాదిస్తారు, కానీ పిల్లలు వాటిని అనుభవిస్తారు, అవసరమైతే అమ్మేస్తారు కూడా. వారు "మా తండ్రి మేము సుఖపడాలని ఇచ్చాడు" అని భావిస్తారు. ఒకవేళ తండ్రి ఇంకా జీవించి వున్నా, తండ్రి కష్టపడి సంపాదించిన ఆస్తులను పిల్లలు అమ్మేస్తూ ఉండటం చూసి బాధపడతాడు.

అప్పుడు "వాడి కోసం ఇంత కష్టపడ్డాను ఎందుకు?" అని అనిపిస్తుంది. ఇదంతా ఎందుకు జరుగుతుంది అంటే, మరణానంతర జీవితం గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల. ఆ అవగాహన ఉంటే, పక్షి తన పిల్లలకు రెక్కలు వచ్చిన తర్వాత వాటిని ఎలా స్వేచ్ఛగా వదిలేస్తుందో, అలాగే మనిషి కూడా పిల్లలు పెద్ద వారు అయ్యి వారి బాధ్యతలు వారు నిర్వర్తించగలిగిన తర్వాత వారిని స్వతంత్రంగా జీవించనిస్తాడు. తన పని తాను చేసుకుంటాడు. తాను సంపాదించినదాన్ని తన ఆత్మోన్నతి కోసం ఉపయోగిస్తాడు. దానాలు చేస్తాడు, సేవా కార్యక్రమాలు చేస్తాడు, సాధన చేస్తాడు. తనకు నిజమైన లాభం కలిగించే పనుల వైపు దృష్టి మళ్లిస్తాడు.

అందువల్ల గుర్తుంచుకోండి. ఎవరైనా సరే చనిపోయిన తర్వాత తాను చేసిన కర్మలను బట్టే తాను పొందే లోకాలు ఉంటాయని తెలుసుకోవాలి. దానికి అనుగుణంగా జీవితాన్ని మలుచుకోవాలి. అలా జీవించిన వాడే నిజమైన లాభం పొందుతాడు. జీవితమంతా డబ్బు సంపాదనలో గడిపి, అన్నీ పిల్లలకు వదిలేసి, పై లోకాలకు వెళ్ళిన తర్వాత బాధపడటానికి కాదు ఈ జీవితం. భూమిపై అవసరాలకు సరిపడా సంపాదించుకుంటూ, మిగిలిన సమయాన్ని జ్ఞానం పెంచుకోవడానికి ఉపయోగించి, ఉన్నత లోకాలను చేరుకోవడానికి ప్రయత్నించాలి, అలా జీవించిన వాడే అదృష్టవంతుడు.

**తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే**

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

# జన్మ ప్రణాళిక తెలుస్తుంది?

ఏ మానవుడైనా సరే మోక్ష స్థితిని సంపాదించడానికి ప్రయత్నం చేయాలి. అంతేకానీ భూమ్మీద ఎన్ని సంపాదించినా, ఎన్ని సాధించినా ప్రయోజనం లేదు. ఎందుకంటే మీరు పుడతారు, ఏదేదో హడావిడి చేస్తారు, ఏదేదో సాధించామని అనుకుంటారు. తర్వాత ఈ ప్రపంచం నుంచి నిష్క్రమిస్తారు. మళ్లీ పుడతారు, మళ్ళీ అదే హడావిడి కొనసాగుతుంది. కొన్నిసార్లు ఆ జీవితం నరకాన్ని తలపిస్తుంది, అప్పుడు "ఎందుకు ఈ జీవితం?" అనిపిస్తుంది. ఒకో జన్మలో ఆత్మహత్య కూడా చేసుకుంటారు.

ఎన్ని జన్మలు తీసుకున్నా ఇలాగే ఉంటుంది. ప్రదేశాన్ని మారుస్తారు, శరీరాన్ని మారుస్తారు, కుటుంబాన్ని మారుస్తారు, మతాన్ని మారుస్తారు. అలాగే కొన్ని జన్మల్లో పురుషుడిగా, మరికొన్ని జన్మల్లో స్త్రీగా జన్మిస్తారు, ఇలా మారుతూ ఉంటుంది. మరి దీనికి అంతం ఎప్పుడు? అంటే మోక్షం పొందినప్పుడు, మీ లక్ష్యాన్ని సాధించినప్పుడు. ఆ లక్ష్యాన్ని సాధించాలంటే మరణించిన తర్వాత జరిగే విషయాలపై అవగాహన కలిగి ఉండాలి. ఆ అవగాహన ఎంత ఎక్కువగా ఉంటే, మీ లక్ష్యాన్ని అంత త్వరగా సాధించ గలుగుతారు.

ఇక్కడ మీకు ఒక సందేహం రావచ్చు. "అసలు మరణించిన తర్వాత ఏమి జరుగుతుంది?" అని. మీరు గమనించండి, ఇప్పుడు ఈ జీవితంలో ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నారు, ఎన్నో నేర్చుకుంటున్నారు, ఎంతో మందితో పరిచయాలు ఏర్పరుచు కుంటున్నారు, ఎంత మందితో కలిసి జీవిస్తున్నారు. అలాగే మరణించిన తర్వాత శరీరం ఉండదు, కానీ మీరు ఉంటారు, అక్కడ కూడా మీ లాగే ఎంతోమంది ఉంటారు.

భూమ్మీద ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఒక చోట కలిసినట్టే, మరణించిన తర్వాత కూడా ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వారు కలుసుకుంటారు, చర్చించుకుంటారు, ఎన్నో విషయాలు తెలుసుకుంటారు. భూమ్మీద ఉండే

పరిచయాలు వేరు, మరణానంతరం ఏర్పడే పరిచయాలు వేరు, అందువల్ల మరణించిన తర్వాత కూడా ఎన్నో విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

మీరు అనవచ్చు, “మాకు ఏమీ గుర్తు లేవు, అవన్నీ ఎలా తెలుస్తాయి?” అని. కానీ మరణించిన తర్వాత శరీరం ఉండకపోవచ్చు, అయితే ఈ శరీరంలో ఉన్న ఆత్మ మాత్రం ఉంటుంది. మీరు తెలుసుకున్నవి, నేర్చుకున్నవి అన్నీ ఆ ఆత్మలో నిక్షిప్తమై ఉంటాయి.

మీరు ఇలా కూడా అనవచ్చు, “అసలు ఆత్మే తెలియదు, ఆత్మ ఉందని మాకు ఎలా తెలుస్తుంది?” అని. అయితే దానికి అవకాశం ఉంది, ఎలా అంటే? మీరు ఈ “శ్వాస మీద ధ్యాస” ధ్యానాన్ని తీవ్రంగా చేసి, సాత్వికమైన శాకాహారాన్ని తీసుకుంటే, మీకు తెలియకుండానే మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గుతుంది, ముందుగా బుద్ధి వికసిస్తుంది, ఆ తర్వాత జ్ఞానం ఉదయిస్తుంది.

ఆ జ్ఞానం పెరిగినప్పుడు, మీ కంటికి కనిపించని విషయాలను కూడా మీరు తెలుసుకోగలుగుతారు. అప్పుడు ఆత్మ, మరణానంతర జీవితం, సృష్టి రహస్యాలు వంటి అనేక విషయాలు మీ అనుభవంలోకి వస్తాయి.

మీ బుద్ధి, జ్ఞానం పెరిగినప్పుడు మీరు సద్గురువులను ఆశ్రయిస్తారు. వారు చెప్పే విషయాలన్నింటినీ శ్రద్ధగా వింటారు, మననం చేసుకుంటారు, అర్థం చేసుకుంటారు. గురువులు చెప్పిన వాటిని ఆచరించే ప్రయత్నం చేస్తారు. అప్పుడు మీకు తెలియకుండానే, పై లోకాల్లో ఆత్మ ద్వారా నేర్చుకున్న విషయాలు మీ ఆత్మ నుంచే స్ఫురించడం ప్రారంభమవుతుంది. అప్పుడు సద్గురువులు చెప్పింది సత్యమే అని మీకు అర్థమవుతుంది. దాంతో మీరు మరింత శ్రద్ధ పెడతారు, మీ జ్ఞానాన్ని ఇంకా పెంచుకుంటారు. ప్రస్తుతం మీరు అందరూ ఆ స్థితిలోనే ఉన్నారు.

ఇప్పుడు మరణించిన తర్వాత ఏమి జరుగుతుందో మరో విషయం

తెలుసుకుందాం.

**"మీ జీవిత ప్రణాళిక ఏమిటో తెలుస్తుంది".** అయితే మీరు జ్ఞానం పొంది, జీవించి ఉండగానే మరణానంతరం జరిగే విషయాలను తెలుసుకుంటే, మీ ప్రణాళిక ఏమిటో కూడా జీవించి ఉండగానే తెలుసుకోగలుగుతారు. అప్పుడు దానికి అనుగుణంగా మీ జీవితాన్ని మార్చుకుంటారు, దాని వల్ల ఎంతో లాభం పొందుతారు, మీ జన్మను వృథా చేసుకోరు.

ఒక సందర్భంలో పత్రి గారు ఏమన్నారంటే, **"ప్రణాళిక ప్రకారం జీవిస్తే జీవించినట్టు, ప్రణాళిక ప్రకారం జీవించకపోతే మరణించినట్టు"** అన్నారు. ఎందుకంటే మీరు భూమి పైకి రాక ముందే, పై లోకాలలో ఉన్న మాస్టర్లతో చర్చిస్తారు. "భూమి పైకి వెళ్ళి ఏం చేయాలి? ఏం చేస్తే ఉన్నత లోకాలకు చేరుకోగలను? వంటి విషయాలన్నింటినీ చర్చించి నిర్ణయించుకుంటారు.

ఒక రకంగా చెప్పాలంటే, పై లోకాలలో ఆత్మ గురించే ఆలోచిస్తారు. కారణం పై లోకాలలో ఆత్మ మాత్రమే ఉంటుంది, అందుచేత ఆత్మ గురించే ఆలోచిస్తారు. అక్కడ మీ కూతురు, కొడుకు, బంధువులు వంటి సంబంధాలు ఉండవు, అక్కడ ఉన్నది ఆత్మ మాత్రమే, అందువల్ల ఆత్మ అభివృద్ధి గురించే ఆలోచిస్తారు. నేను ఉన్న లోకం నుంచి ఉన్నతలోకానికి చేరుకోవాలి అనే వుంటుంది.

ఇప్పుడు ఉన్న స్త్రీ శరీరం గానీ, పురుష శరీరం గానీ అక్కడ ఉండవు. అందరూ ఆత్మలుగానే ఉంటారు. అక్కడ మీరు ఏం చేయాలని నిర్ణయించుకున్నారో, భూమిపైకి వచ్చిన తర్వాత దాదాపు మర్చిపోతారు. అందుచేత చేయవలసింది ఒకటి, చేస్తున్నది ఇంకొకటి అవుతుంది. పత్రి గారు ఏమంటారంటే, "కనీసం 50% అయినా చేయండి" అంటారు. అంటే ఆత్మ కోసం నిర్ణయించుకున్న పనుల్లో కనీసం సగం అయినా చేయండి. అప్పుడు మీరు నిజంగా జీవించినట్టే. లేకపోతే ఆ జీవితం ఎందుకు?

కొంత మందిని చూస్తే నాకు ఆశ్చర్యం కలుగుతుంది. ఈ విషయాలు

తెలుసుకోవడానికి 3, రోజుల కార్యక్రమానికి రమ్మంటే, మేము పదేళ్ళ క్రితమే ఒకసారి వచ్చాం అంటారు. అప్పుడు నవ్వాలో, బాధపడాలో కూడా తెలియదు. ఒక్కసారి విన్నంత మాత్రాన పరిపూర్ణ జ్ఞానం వచ్చేసినట్టుగా భావిస్తారు.

ఇప్పుడు మీరు ఇక్కడికి వచ్చారు కాబట్టి ఈ విషయాలు వింటున్నారు, రాకపోతే ఎలా వింటారు? మీరు ఆత్మగా ఉన్నప్పుడు, పై లోకాలలో భూమిపై తీసుకోబోయే శరీరంతో తీవ్ర సాధన చేయాలని, పుస్తకాలు చదవాలని, సద్గురువుల సాంగత్యం పొందాలని, సేవలు చేయాలని, జ్ఞానం పెంచుకోవాలని నిర్ణయించుకుని వస్తారు.

కానీ విచిత్రం ఏమిటంటే, ఇక్కడికి వచ్చిన తర్వాత ఆ ప్రణాళిక మొత్తాన్ని మర్చిపోతారు. ఈ మాయా ప్రపంచంలో పడి, తానెవరో మర్చిపోతారు, తన ప్రణాళికను మర్చిపోతారు. చుట్టూ ఉన్నవారు ఏం చేస్తే, తాను కూడా అదే చేస్తూ ఉంటారు. తాను ఆత్మ అనే విషయాన్నే మర్చిపోతారు, సుఖాలు, భోగాలే జీవితమని భావిస్తారు. వాటిని అనుభవించాలంటే ధనం అవసరం కాబట్టి, ధన సంపాదనపైనే పూర్తిగా దృష్టి పెడతారు.

ఇక్కడ మీకు ఒక సందేహం రావచ్చు. “నా ప్రణాళిక ఏమిటో నాకు ఎలా తెలుస్తుంది?” అని. దానికి మీరు తీవ్ర ధ్యాన సాధన చేసి మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గించి, ఆత్మ యొక్క ప్రాముఖ్యం పెంచుకోవాలి. ఆత్మ ప్రాముఖ్యత పెరిగే కొద్దీ, మనసు చెప్పినట్టు కాకుండా ఆత్మను అనుసరించి జీవిస్తారు.

మనసు ప్రాపంచిక విషయాలు చెబుతుంది. కానీ ఆత్మ పై లోకాలలో రూపొందించుకున్న ప్రణాళిక ప్రకారం మిమ్మల్ని నడిపిస్తుంది. మీరు ఆ ప్రణాళిక ప్రకారం జీవిస్తుంటే ఆత్మ నిశ్శబ్దంగా ఉంటుంది, కానీ ప్రణాళికకు విరుద్ధంగా ప్రవర్తిస్తే మిమ్మల్ని హెచ్చరిస్తుంది. అంతేకాదు, మీరు ఏం చేయాలో కూడా స్ఫురింపజేస్తుంది.

మీ బుద్ధి కొంచెం వికసిస్తే ఈ విషయాలన్నీ మీకు అర్థమవుతాయి,

నేను చెప్పినవి వాస్తవంగా జీవితంలో జరుగుతాయి. నా జీవితంలో కూడా పత్రి గారు పరిచయం అయిన తర్వాత ఇవన్నీ ఇలాగే అర్థమయ్యాయి.

ఆత్మను అనుసరించి జీవించిన వారికి ప్రకృతి తప్పకుండా సహాయం చేస్తుంది, వారు చేసే పనులకు సహకరిస్తుంది. అటువంటి సహకారం పొందడానికి మాకు దాదాపు పది సంవత్సరాలు పట్టింది, ఆ తరువాత ప్రకృతికి మా మీద నమ్మకం ఏర్పడింది. మీ ప్రణాళికకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఆత్మ ఊరుకోదు. మిమ్మల్ని హెచ్చరిస్తూనే ఉంటుంది, అందుకే సాధనను మరింత తీవ్రతరం చేయాలి. గుర్తుపెట్టుకోండి, ఈ శరీరంలో ఉన్న ఆత్మే అందరి శరీరాల్లో కూడా ఉంది, పత్రి గారు దొరకకపోయి ఉంటే నా జీవితం ఏమైపోయేదో నాకు తెలియదు.

అందుచేత మరణానంతర జీవితం గురించి తెలుసుకుంటే, అంటే మరణించిన తర్వాత జరిగే విషయాలను తెలుసుకుంటే, మీ జీవిత ప్రణాళిక ఏమిటో మీకు తెలుస్తుంది. సాధనను తీవ్రంగా చేయడం వల్ల మనసు యొక్క ప్రాముఖ్యత తగ్గి, ఆత్మ యొక్క ప్రాముఖ్యత పెరుగుతుంది. ఆత్మ నుంచి మీకు నిరంతరం సంకేతాలు అందుతూనే ఉంటాయి. మీరు ఏదైనా తప్పు చేస్తే, "నువ్వు తప్పు చేశావు" అనే స్ఫురణ కలుగుతుంది. ఆ స్ఫురింపచేసేది ఆత్మే.

దానితో పాటు మీకు సద్గురువు దొరికితే, అంతకంటే గొప్ప అదృష్టం ఇంకేముంటుంది? సద్గురువు చెప్పేది, ఆత్మ నుంచి స్ఫురించేది ఈ రెండూ ఒకటే అవుతాయి. నా జీవితంలో అదే జరిగింది. పత్రి గారు చెప్పేది, లోపల నుంచి స్ఫురించేది రెండూ ఒకటి గానే అనిపించాయి.

మొదట్లో మనసుకు ఎన్నో సందేహాలు కలిగాయి. వ్యాపారాలు మానేసినప్పుడు, "చూశావా ఇప్పుడు పరిస్థితి ఎలా అయిందో!" అని మనసు భయపెట్టేది. కానీ పత్రిగారు ఇచ్చిన జ్ఞానం వల్ల ఆ మనసును ప్రక్కన పెట్టగలిగాను, ఇంకా ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాను.

అందుచేత మీ కంటికి కనిపించకపోయినా, మీరు ఆత్మ అనే విషయాన్ని తెలుసుకోండి. అంతేకాదు, ఈ భూలోకం మాత్రమే కాదు, ఈ సృష్టిలో కోట్లాది లోకాలు ఉన్నాయని కూడా తెలుసుకోండి. భూమిపై మానవులు ఉన్నట్లే, ఆ లోకాల్లో మానవాత్మలు ఉన్నాయి. భూమిపై సద్గురువులు ఉన్నట్లే, అక్కడ కూడా ఊర్ధ్వలోక మాస్టర్లు ఉన్నారు. భూమిపై మీరు చేసే కర్మలు అక్కడ రికార్డు అవుతుంటాయి. భూమిపై సద్గురువులు ఎలా బోధిస్తారో, అక్కడ ఊర్ధ్వ లోక మాస్టర్లు కూడా అలాగే మార్గదర్శకం చేస్తారు. భూమిపై జరిగేదానికి భిన్నంగా అక్కడ ఏమీ ఉండదు. భూమిపై కంటికి కనిపిస్తుంది, పై లోకాలలో కంటికి కనిపించదు, అంతే తేడా. చివరిగా నేను చెప్పేది ఒక్కటే! సాధనను తీవ్రంగా చేసి, మీ జీవిత ప్రణాళిక ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేయండి. ఆ ప్రణాళికను తెలుసుకుని దానికి అనుగుణంగా జీవించగలిగితే, మీకంటే అదృష్టవంతుడు మరొకరు ఉండరు.

ఎందుచేతనంటే, జీవించి ఉన్నప్పుడు మీరు మాయలో ఉంటారు. మాయలో ఉండడం అంటే మాయమైపోయే వాటినే శాశ్వతమని భావించడం. వాటికే ప్రాముఖ్యం ఇస్తారు, వాటి కోసమే జీవిస్తారు. కానీ మరణించిన తర్వాత వాస్తవాన్ని తెలుసుకుంటారు, అక్కడ మాయ ఉండదు, మాయమైపోయేవి ఉండవు, శాశ్వతమైనవే ఉంటాయి, వాటి గురించి అవగాహన పొందుతారు.

అందుచేత జ్ఞానం పొందినవారిని గానీ, సద్గురువుల ద్వారా ఈ విషయాలు తెలుసుకున్నవారిని గానీ గమనిస్తే, వారి జీవన విధానం పూర్తిగా మారిపోతుంది, వారి పనులు మారిపోతాయి, బాధ్యతలు మారిపోతాయి, అలవాట్లు మారిపోతాయి, ఆలోచించే విధానం కూడా మారిపోతుంది. అది చూసే వారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

నా విషయానికొస్తే, నాకు గానీ మేడంకు గానీ పత్రి గారి పరిచయం కాక ముందు ఉన్న జీవితం, పత్రి గారి పరిచయం అయిన తర్వాత ఉన్న జీవితం పూర్తిగా భిన్నంగా మారిపోయింది. అందరూ ఆశ్చర్యపడే విధంగా

మారిపోయింది.

అంతకు ముందు నేను వ్యాపారమే చేసేవాడిని, ధన సంపాదనకే ప్రాధాన్యం ఇచ్చేవాడిని. కానీ పత్రి గారి పరిచయం అయిన తర్వాత నా వ్యాపారాలన్నీ మానేశాను. అంతకుముందు ధన సంపాదనకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చేవాడిని, కానీ పత్రి గారి పరిచయం అయిన తర్వాత జ్ఞాన సంపాదనకే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నాను.

అంతకు ముందు పిల్లలందరూ మాతో కలిసి ఉండేవారు. వారు పెద్ద వారైనా, వారి బాధ్యతలు వారు నిర్వహించుకోగలిగినా, "వాళ్లు చేసుకోలేరేమో" అనే భావంతో బయటకు పంపలేదు. కానీ పత్రిగారి పరిచయం అయిన తర్వాత నాకు ఉన్న ఇద్దరు కుమారులకు ఆస్తిని మూడు వాటాలుగా విభజించి, మా వాటా మేము ఉంచుకుని, వారి వాటాలు వారికి ఇచ్చి స్వతంత్రంగా జీవించేలా చేశాం.

అంతకుముందు ఎందుకు పంపలేదంటే, "వాళ్లు జీవించగలరా? లేదా?" అనే భయం ఉండేది. నేను గానీ, మేడం గానీ పత్రిగారు ఉన్నంతకాలం మా కుటుంబ సమస్యల గురించి, ఆర్థిక పరిస్థితి గురించి, కుటుంబ సభ్యుల గురించి ఎప్పుడూ అడగలేదు. ఎందుకంటే అలాంటి ప్రశ్నలు అడగడం వల్ల మన దృష్టి వాటిపైనే ఉందని ఆయన భావిస్తారని మాకు తెలుసు.

అయితే ఆయనను ఒక్కసారి మాత్రమే ఒక విషయం అడిగాను. "నేను ఈ మార్గంలో పూర్తిగా ప్రవేశిస్తే, పిల్లలు వారి వ్యాపారాలు వారు చూసుకోగలరా? వారి భవిష్యత్తు ఎలా ఉంటుంది?" అని అడిగాను. అప్పుడు ఆయన, "వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదు, వారి భవిష్యత్తును వారు బాగానే చూసుకుంటారు" అని చెప్పారు. ఆ ధైర్యంతో వారిని స్వతంత్రంగా పంపించాను. తర్వాత వారి గురించి ఆందోళన పడలేదు, అలా మా కుటుంబంలో ఎంతో మార్పు వచ్చింది.

పత్రి గారి పరిచయం కాక ముందు బంధువుల వివాహాలు,

శుభకార్యాలు, మరణ కార్యక్రమాలు అన్నింటికీ వెళ్ళే వాడిని, ఇప్పుడు దాదాపు ఏ కార్యక్రమానికీ వెళ్ళడం లేదు. అవకాశం ఉంటే కొద్ది సేపు వెళ్ళి వచ్చేస్తాను. ఒక రకంగా చెప్పాలంటే, మమ్మల్ని పిలవడమే చాలామంది మానేశారు.

అంతేకాదు,

- అంతకుముందు దేహ సేవ చేసే వాళ్ళం, కానీ పత్రి గారి పరిచయం అయిన తర్వాత ఆత్మ సేవలే చేస్తున్నాం.
- అంతకుముందు దేహ బంధువులతో ఎక్కువ సమయం గడిపే వాళ్ళం, ఇప్పుడు ఆత్మ బంధువులతోనే ఎక్కువగా గడుపుతున్నాం.
- అంతకు ముందు ఎక్కడికీ వెళ్ళే వాళ్ళం కాదు, కానీ ఇప్పుడు భారతదేశం మాత్రమే కాదు, ఇతర దేశాలు కూడా తిరుగుతున్నాం.
- అంతకుముందు సంపాదన కోసమే సమయమంతా వెచ్చించే వాళ్ళం, ఇప్పుడు జ్ఞాన సంపాదన కోసమే సమయాన్ని వినియోగిస్తున్నాం.
- అంతకుముందు మా ధనాన్ని పండుగలు, ఫంక్షన్లు, పిల్లలు, బంధువులు వంటి వాటి కోసం ఖర్చు చేసే వాళ్ళం. ఇప్పుడు మా ధనాన్ని ఆత్మబంధువుల కోసం, జ్ఞాన సంబంధ సేవల కోసం ఖర్చు పెడుతున్నాం.
- అంతకుముందు వారపత్రికలు, మాసపత్రికలు, సాధారణ పుస్తకాలు చదివే వాళ్ళం, ఇప్పుడు పూర్తిగా ఆధ్యాత్మిక, జ్ఞాన సంబంధ పుస్తకాలనే చదువుతున్నాం.
- అంతకు ముందు ఎవరికీ సందేశాలు ఇచ్చే వారం కాదు, ఇప్పుడు అందరికీ సందేశాలు ఇస్తున్నాం.
- అంతకుముందు పుస్తకాలు వ్రాయలేదు, ఇప్పుడు ఎన్నో పుస్తకాలు వ్రాశాం, ఇంకా వ్రాస్తూనే ఉన్నాం.
- అంతకుముందు "నేను ఈ దేహమే" అన్న భావంతో జీవించే వాళ్ళం, ఇప్పుడు "మేము ఆత్మలం" అనే అవగాహనతో జీవిస్తున్నాం.
- అంతకుముందు దేహానికే ప్రాముఖ్యం ఉండేది, ఇప్పుడు ఆత్మకే ప్రాముఖ్యం ఇస్తున్నాం.

- అంతకు ముందు అందరూ వేర్వేరుగా కనిపించేవారు. కొత్త వారిని కలిసినా "మీ కులం ఏమిటి?" అని అడిగే వారం, ఇప్పుడు అందరూ ఒక్కటేనని అర్థమైంది, అందుచేత కుల ప్రస్తావన పూర్తిగా తగ్గిపోయింది.
- అంతకుముందు ఆరాధనలు చేసే వారం, ఇప్పుడు ధ్యానమే చేస్తున్నాం.
- అంతకుముందు "దేవుడు వేరు, నేను మానవుడిని" అనే భావం ఉండేది, కానీ పత్రిగారి పరిచయం అయిన తర్వాత "ఆ దేవుడు ఎవరో కాదు, నేనే ఆ దేవుణ్ని" అనే అవగాహన కలిగింది.
- అంతకు ముందు ఎంతోమంది దేవుళ్ళు ఉన్నారని భావించే వారం, ఇప్పుడు ఉన్నది ఒక్క పర బ్రహ్మమే అని, అందరు దేవుళ్ళు దేవతలు ఆయనలో భాగాలేనని తెలుసుకున్నాం.
- అంతకుముందు ప్రాపంచిక విషయాలపై ఆసక్తి ఎక్కువగా ఉండేది, ఇప్పుడు ఆ ఆసక్తి తగ్గిపోయింది.
- అంతకుముందు సుఖపడాలి, అన్నీ అనుభవించాలి అని భావించే వారం, ఇప్పుడు అవసరాలకు పరిమితమై జీవిస్తున్నాం.
- అంతకు ముందు ఎక్కడ ఉన్నా, ఎక్కడికి వెళ్ళినా గొప్పగా జీవించాలని అనుకునేవారం, ఇప్పుడు ఉంటే అనుభవిస్తున్నాం, లేకపోతే అలాగే జీవిస్తున్నాం. ఒక రకంగా చెప్పాలంటే, మా ఇద్దరి లో విపరీతమైన మార్పు వచ్చింది.
- అంతకు ముందు ఇద్దరం తరచూ ఏదో ఒక విషయంలో భిన్నాభిప్రాయాలతో ఉండేవాళ్ళం. ఇప్పుడు ఎంతో అవగాహనతో, అన్యోన్యంగా జీవిస్తున్నాం.
- అంతకుముందు మా కుటుంబం కోసమే జీవించాం, ఇప్పుడు మా కుటుంబం పెద్దదైపోయింది. మీ అందరూ మా కుటుంబమే అన్న భావనతో అందరి కోసం జీవిస్తున్నాం.

మా ఇద్దరిలో ఇంత మార్పు రావడానికి ముఖ్య కారణం "శ్వాస మీద ధ్యాస" ధ్యానాన్ని ఎక్కువగా చేయడం, సాధనను పెంచుకోవడం, జ్ఞానాన్ని సంపాదించుకోవడం, మరణానంతర జీవితం గురించి అవగాహన కలిగి

ఉండడం.

ఇవన్నీ కలిపి మాలో విపరీతమైన మార్పును తీసుకొచ్చాయి. సరైన విధంగా ఆలోచించగలుగుతున్నాం. ఎన్నో విషయాలు తెలుసుకోవడమే కాదు, వాటిని ఇతరులకు బోధించడం వల్ల కూడా మా అనుభవం పెరిగింది. వాటిని పుస్తక రూపంలో తీసుకురావడం వల్ల మా అవగాహన మరింత పెరిగింది.

అంతేకాదు, అన్ని రాష్ట్రాలలోని అనేకమంది సాధకులతో సాంగత్యం చేయడం వల్ల వారి అనుభవాల నుంచి కూడా ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నాం, నేర్చుకుంటున్నాం. దాంతో మా అనుభవం మరింత విస్తరించింది.

మా ఇద్దరిలో ఇంత మార్పు రావడానికి ఇవన్నీ కారణాలే అయినప్పటికీ, అన్నింటికంటే ముఖ్య కారణం పత్రి గారి పరిచయమే, ఆయన ఇచ్చిన జ్ఞానమే. ఆయన మమ్మల్ని సరిదిద్దడమే కాదు, సరైన విధంగా జీవించేటట్లు చేశారు, ఆయన ఆదర్శమే మమ్మల్ని ఈ స్థితికి తీసుకొచ్చింది.

ఇంతకీ నేను చెప్పేది ఒక్కటే, మరణించిన తర్వాత ఏమి జరుగుతుందో అన్న విషయంపై మీరు ఎంత అవగాహన పెంచుకుంటే, మీ జీవితం అంత సరైన మార్గంలో మారిపోతుంది. అంతేకాదు, ఎన్నో జన్మలు తగ్గిపోతాయి, మీ లక్ష్యం మరింత దగ్గరవుతుంది.

అందుచేత మరణానంతర జీవితం గురించి ఎక్కువగా తెలుసు కోవడానికి ప్రయత్నించండి. దానిపై ఎన్నో పుస్తకాలు ఉన్నాయి, వాటిని పదే పదే చదవండి, అనేక వీడియోలు ఉన్నాయి, వాటిని పదే పదే వినండి. కచ్చితంగా మీ జీవితంలో మార్పు వస్తుంది.

నేను ఇప్పటికే ఎంతో మందిలో ఆ మార్పును చూస్తున్నాను. మీలో కూడా చాలామంది మారుతున్నారు, ఇంకా మారుతూనే ఉన్నారు. అందుచేత మరణానంతర జీవితం గురించి మీ అవగాహనను పెంచుకోండి. అలా చేయగలిగితే, మీకంటే గొప్ప వారు ఈ భూమిపై మరొకరు ఉండరు.

# "అంతా వేరు వేరు కాదు, అంతా ఒకటే"

"నిజానికి, భూమిపై ఉన్నప్పుడు మనుషులు మాయలో జీవిస్తారు, మరణించిన తర్వాత వాస్తవంలో ఉంటారు". అయితే భూమిపై జీవిస్తున్నప్పుడే ఎవరైతే వాస్తవాన్ని గ్రహించి జీవిస్తారో, వారు ఆధ్యాత్మికంగా, ఆత్మపరంగా, జ్ఞానపరంగా ఎంతో ఎదిగినవారు అవుతారు. ఎందుకంటే మాయకు, వాస్తవానికి పూర్తి భిన్నంగా వుంటుంది.

వాస్తవాన్ని తెలుసుకున్న వారు ఉన్నది ఉన్నట్టుగా చూస్తారు, అర్థం చేసుకుంటారు, జీవిస్తారు. కానీ మాయలో జీవించేవారు లేనివి ఉన్నట్టుగా భావించి వాటికే ప్రాముఖ్యం ఇస్తారు. ఉన్నది ఉన్నట్టుగా జీవించినప్పుడు జీవితం సరైన దిశలో సాగుతుంది, సృష్టికి అనుగుణంగా జీవిస్తారు. ఎప్పుడైతే మీరు సృష్టికి అనుగుణంగా జీవిస్తారో, అప్పుడు మీరు మీ గమ్యానికి చాలా దగ్గరవుతారు.

కానీ మాయలో జీవించే వ్యక్తి లేనివాటినే ఉన్నట్టుగా భావిస్తూ, వాటికే ప్రాధాన్యం ఇస్తూ, చేయకూడని పనులు చేస్తూ, సృష్టి విరుద్ధంగా, అధర్మంగా ప్రవర్తిస్తూ, "నేను సరైన విధంగానే జీవిస్తున్నాను" అని అనుకుంటాడు. ఫలితంగా కర్మలను పెంచుకోవడమే కాకుండా, కష్టాలను కూడా పెంచుకుంటాడు. అందువల్ల అతని గమ్యం మరింత దూరమవుతూ ఉంటుంది.

మాయలో జీవించేవాడు ఈ దేహాలను మాత్రమే చూస్తాడు, దేహాలు వేరు వేరుగా కనిపిస్తాయి. ఒక దేహానికి ఇంకో దేహానికి సంబంధం లేదని అనిపిస్తుంది. వారు స్త్రీలు–వీరు పురుషులు; వారు ధనవంతులు–వీరు పేదవారు; వాడు పదవిలో ఉన్నాడు – వీడు పదవి లేనివాడు; వాడు మేధావి – వీడు అమాయకుడు; వాడు ఆరోగ్యవంతుడు–వీడు అనారోగ్యవంతుడు;

వాడు అందగాడు–వీడు అంగవైకల్యంతో ఉన్నాడు అని అనేక తేడాలు కనిపిస్తాయి.

కానీ మీరు గమనిస్తే, ఇవన్నీ దేహానికి సంబంధించిన తేడాలే. కాని ఈ దేహాలు శాశ్వతమైనవి కావు, ఇవన్నీ ఒకరోజు నశించిపోతాయి. అయినప్పటికీ వాటినే నిజమని, శాశ్వతమని భావించి జీవిస్తే, అది సృష్టి విరుద్ధమైన జీవితం అవుతుంది.

విచిత్రం ఏమిటంటే, ఎప్పుడైతే శరీరాన్ని విడిచి పై లోకాలకు వెళ్తారో! అప్పుడు ఈ భౌతిక దేహాన్ని ఇక్కడే వదిలి వెళ్తారు, చివరికి మిగిలేది ఆత్మ మాత్రమే. పై లోకాలకు వెళ్ళిన  వారందరూ కూడా శరీరాన్ని వదిలి ఆత్మ రూపంలోనే వెళ్ళిన వారే.

భూమిపై ఉన్నప్పుడు దేహాలు మాత్రమే కనిపిస్తాయి కాబట్టి అందరూ వేరు వేరుగా కనిపిస్తారు. కానీ పై లోకాలకు వెళ్లినప్పుడు అక్కడ వాస్తవం మాత్రమే ఉంటుంది, అక్కడ అందరూ ఆత్మలే. అప్పుడు “ఎవరు భర్త? ఎవరు భార్య? ఎవరు కొడుకు? ఎవరు కూతురు?” అనే భేదాలు ఉండవు. అందరూ ఒకే ఆత్మ స్వరూపంగా కనిపిస్తారు. అప్పుడు “అంతా ఒకటే” అనే సత్యం స్పష్టంగా అర్థమవుతుంది. “నేను ఎలా ఆత్మనో, ఇతరులూ అలాగే ఆత్మలే” అనే అవగాహన కలుగుతుంది. “అంతా నేనే, నేనే అంతా” అనే అనుభూతి కలుగుతుంది.

ఈ విషయాన్ని మీరు భూమిపై ఉన్నప్పుడే తెలుసుకుంటే, మీ ప్రవర్తన ఎంత మారిపోతుందో ఆలోచించండి. నిజంగా అంతా ఒకటే అని అర్థమైతే, ద్వేషం ఎందుకు ఉంటుంది? అసూయ ఎందుకు ఉంటుంది? కోపం ఎందుకు ఉంటుంది? హింస ఎందుకు ఉంటుంది? మోసం, దొంగతనం, యుద్ధాలు ఎందుకు జరుగుతాయి?

ప్రపంచంలో మనుషులు ఒకరినొకరు వేరు వేరుగా భావించడం

వల్లే ఈ సమస్యలన్నీ వస్తున్నాయి. కానీ మరణానంతర జీవితం గురించి అవగాహన ఉంటే, అలాంటి ప్రవర్తన ఉండదు.

ఈ సత్యం మీకు ఎలా తెలుస్తుంది? మరణించిన తర్వాత అది చాలా స్పష్టంగా తెలుస్తుంది. “ఈ దేహం నేను కాదు” అనే విషయం ప్రత్యక్ష అనుభవమవుతుంది. అయితే జీవించి ఉన్నప్పుడే దీనిని తెలుసుకుంటే, మీ ఆలోచనలు, మాటలు, పనులు, జీవన విధానం అన్నీ మారిపోతాయి. లేదా మీరు జ్ఞానాన్ని సంపాదించి, బుద్ధిని వికసింపజేసుకుంటే కూడా ఈ సత్యాన్ని గ్రహించగలరు. మరణానంతరం ఏమి జరుగుతుందో, వాస్తవం ఏమిటో తెలుసుకోగలరు. అలాగే ఒక సద్గురు లభించినప్పుడు, ఆయన బోధల ద్వారా కూడా ఈ అవగాహన కలుగుతుంది.

గురువు చెప్పిన సత్యాన్ని బుద్ధి పరిపక్వంగా ఉన్నవారు అర్థం చేసుకుంటారు. అప్పుడు “అరే! అంతా వేరు వేరు కాదు, అంతా ఒకటే” అనే అవగాహన కలుగుతుంది. ఆ అవగాహన వచ్చినప్పుడు మీ ప్రవర్తన పూర్తిగా మారిపోతుంది. “నా కుటుంబం, నా వాళ్లు” అనే పరిమిత భావన నుంచి “అందరూ నా వాళ్ళే” అనే విశాల భావంలోకి ప్రవేశిస్తారు. ఈ రహస్యాన్ని అర్థం చేసుకున్నవారికి ఇక జన్మ ఎందుకు? ఈ సత్యం పూర్తిగా గ్రహించినవాడు మోక్షాన్ని పొందినట్టే, గమ్యాన్ని చేరుకున్నట్టే, పూర్ణాత్మ స్థితిని పొందినట్టే.

అందుకే మీరు నిజంగా ఆధ్యాత్మికంగా ఎదిగారా? లేదా? అనేది మీ ప్రవర్తనను బట్టి తెలుస్తుంది. మీరు “నేను దేహం” అనే భావంలో జీవిస్తున్నారా? లేక “నేను ఆత్మ” అనే భావంలో జీవిస్తున్నారా? “నేను దేహం” అనుకుంటే అందరూ వేరు వేరుగా కనిపిస్తారు. “నేను ఆత్మ” అని తెలుసుకుంటే అందరూ ఒకటిగానే కనిపిస్తారు. అందువల్ల మరణానంతరం ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి ప్రయత్నించండి, ఆ విషయంపై దృష్టి పెట్టండి. పత్రి గారు కూడా ఈ అంశంపై ఎన్నో వీడియోలు, పుస్తకాలు,

బోధలు అందించారు, వాటిని వినండి, చదవండి, ఆలోచించండి.

మీరు కేవలం కనిపిస్తున్నదే నిజం అని భావించి జీవిస్తే, జీవితం పూర్తిగా దేహ భావంలోనే గడిచిపోతుంది. "నా భార్య, నా భర్త, నా పిల్లలు, నా కుటుంబం" అనే భావంలోనే జీవిస్తారు, కానీ "నేను ఎవరు?" అనే ప్రశ్నను అడగరు.

అదే రమణ మహర్షి చెప్పిన సత్యం "నువ్వు ఎవరో తెలుసుకో." మీరు దేహం కాదు, మీరు ఆత్మ. ఈ దేహానికి పెట్టుకున్న పేరు మీరు కాదు. అది భూమిపై గుర్తింపు కోసం పెట్టుకున్న పేరు మాత్రమే, వీటన్నిటికీ అతీతమైన శాశ్వతమైన ఆత్మ" మీరు. ఈ సత్యాన్ని అర్థం చేసుకుని ఆచరించే వారి జీవితం పూర్తిగా మారిపోతుంది. బుద్ధి వికసించే కొద్దీ జీవితం సత్యానికి దగ్గరవుతుంది. అందుకే ధ్యానం, జ్ఞానం, సాధన ఎంతో అవసరం, బుద్ధి శాతం పెరిగినప్పుడు, మనసు ఆధిపత్యం తగ్గుతుంది. బుద్ధి పరిపక్వమైనప్పుడు గురువు చెప్పిన సత్యాలు స్పష్టంగా అర్థమవుతాయి, అప్పుడు జీవితం సరైన మార్గంలో సాగుతుంది.

అందుకే ధ్యానాన్ని మరింత శ్రద్ధగా, మరింత తీవ్రంగా చేయండి, బుద్ధి వికసించినప్పుడు ఎవరూ చెప్పకుండానే 'సత్యం' మీకు స్వయంగా అర్థమవుతుంది.


**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**
**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**
**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|

# “జీవితం ఒక కల లాంటిదని తెలుస్తుంది”

ఎవరైనా ప్రయత్నం చేసేది జీవిత లక్ష్యానికి దగ్గర కావడానికే.

అందుచేత మీరు 300 జన్మలు తీసుకున్నా, 500 జన్మలు తీసుకున్నా, వెయ్యి జన్మలు తీసుకున్నా ఆ ప్రయత్నం తప్పదు. జన్మ తీసుకోవడం తేలికే, కానీ ఆ జన్మను పూర్తి చేయాలంటే ఎన్ని తిప్పలు పడాల్సి వస్తుందో చూడండి. ఎందుకంటే నేను ఇప్పుడు ఎన్నో చోట్ల తిరుగుతున్నాను, ఎన్నో ఊళ్ళకు వెళ్తున్నాను, ఎన్నో క్లాసులు చెబుతున్నాను, ఎంతో మందికి పరిచయం అవుతున్నాను, సాంగత్యం చేస్తున్నాను.

విచిత్రం ఏమిటంటే, ఎక్కడ చూసినా, ఎవరిని చూసినా ఏదో ఒక సమస్యతోనే ఉన్నారు. సమస్య లేకుండా ఎవరూ లేరు, కొంతకాలం బాగున్నట్టుగా కనిపిస్తుంది, మళ్ళీ జీవితం మారిపోతుంది, జన్మ అంటే అలాంటిదే.

అందుచేత ఎవరైనా సరే, అలాంటి జన్మలను తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. దానికి మార్గం ఆత్మగా మీకు నిర్దేశింపబడిన లక్ష్యాన్ని సాధించడం. ఆ ప్రయత్నం మీదే ఎక్కువ దృష్టి పెట్టాలి, కానీ ఈ మాయా ప్రపంచంలో, ప్రాపంచిక జీవితంలో ఎన్నో రకాల బరువులు, బాధ్యతలు, మమకారాలు, ఆకర్షణలు ఉన్నాయి, వీటన్నింటినీ అధిగమిస్తూ మీ లక్ష్యాన్ని సాధించే ప్రయత్నం చేయాలి.

ఏది ఏమైనా, మీ అదృష్టం ఏమిటంటే ఆ లక్ష్యాన్ని సాధించగలిగే మార్గంలోకి వచ్చారు. అటువంటి గొప్ప గురువు పత్రి గారి పరిచయం ఏర్పడడం వల్ల మీ లక్ష్యం ఏమిటో తెలుసుకునే అవకాశం లభించింది, ఆ మార్గం కూడా తెలుసుకోగలిగారు. అందరూ లక్ష్యం గురించి చెబుతారు, కానీ మార్గాన్ని అందరూ చూపించలేరు.

ఇప్పుడు మీరు ఆ ప్రయత్నమే చేస్తున్నారు. ఇంకొక అదృష్టం ఏమిటంటే, ఈ మార్నింగ్ జూమ్ ద్వారా ప్రతిరోజూ ఎన్నో విషయాలు

తెలుసుకుంటున్నారు. ఇంతకుముందు ఎక్కడ ఉండేది ఈ అవకాశం? ఎప్పుడో ఒకసారి కలవడం, మళ్లీ మర్చిపోవడం జరిగేవి, కానీ ఇప్పుడు ఒక గొప్ప అవకాశం ఉంది.

అలాగే, దీనిని సాధించడానికి కావలసిన తీవ్ర సాధన చేయడానికి భీమవరంలో జరిగే క్లాసులు కూడా గొప్ప అవకాశం లభించినట్టే. అందుచేత కొంచెం శ్రద్ధ పెడితే సాధించగలుగుతారు. మరణానంతర జీవితం మీద ఎంత అవగాహన ఉంటే, మీరు మీ లక్ష్యానికి అంత దగ్గర అవుతారు అని చెప్పుకున్నాం. ఎందుకంటే మరణించిన తర్వాత ఏమి ఉండదని అనుకుంటారు, కానీ అక్కడ ఎన్నో విషయాలు తెలుసుకుంటారు. మరణించిన తర్వాత ఏముంటుందో తెలుసుకోవాలనే ఆసక్తి చాలామందికి ఉంటుంది.

నిజానికి చాలా విషయాలు తెలుస్తాయి. ఆశ్చర్యం ఏమిటంటే, జీవించి ఉన్నప్పుడు ఉన్న జీవితానికి, మరణించిన తర్వాత ఉండే జీవితానికి పూర్తి భిన్నంగా ఉంటుంది. అంటే రివర్స్‌గా ఉంటుంది. అప్పుడు మీరే ఆశ్చర్యపోతారు. “అరే! నేను అలా జీవించానా? ఇలా జీవించాల్సింది కదా?” అని మీరే ఆశ్చర్యపోతారు, అప్పుడు మీకు అర్థమవుతుంది. మీరు నిర్ణయించుకున్నది ఒకటి, మీరు వేసుకున్న ప్రణాళిక ఒకటి, కానీ జీవితం మాత్రం ఇంకో విధంగా ఉంది.

నేను ఇలా ఎందుకు చేశాను? అనే ఆశ్చర్యం కూడా కలుగుతుంది. ఎందుకంటే ఇది మాయా ప్రపంచం, మాయ ప్రభావం వల్ల అలా జరుగుతుంది. అందుచేత ఎన్నో విషయాలు తెలుస్తాయి, మరణించిన తర్వాత మీరు భిన్నంగా జీవించాల్సిందని కూడా అర్థమవుతుంది.

ఈరోజు ఇంకొక విషయం తెలుసుకుందాం. అది ఏమిటంటే? **“జీవితం ఒక కల లాంటిదని తెలుస్తుంది”.** జీవితం ఒక కల లాంటిదని మరణించిన తర్వాత తెలుస్తుంది. కానీ జీవించి ఉన్నప్పుడే ఈ విషయం మీకు తెలిస్తే, దుఃఖం నుంచి బయటపడతారు.

ఇప్పుడు జరుగుతున్నవన్నీ నిజమే అనుకుంటున్నారు, తల్లిదండ్రులు, పిల్లలు, బంధువులు  వీరంతా "నా వాళ్ళు" అని భావిస్తున్నారు. అది నిజమే అనుకుంటూ, వారి కోసం ఎన్నో తప్పులు చేస్తున్నారు, పాపాలు చేస్తున్నారు, చేయకూడని పనులు కూడా చేస్తున్నారు, అధర్మంగా కూడా వ్యవహరిస్తున్నారు.

ఇదంతా నిజం అనుకుంటూ, "నా బాధ్యత కాదా? వాళ్ళు నా వాళ్ళు కారా?" అని భావిస్తూ ఉంటారు. ఒకసారి మీరు గమనించండి, మీరు కూడా కలలు కంటారు, రకరకాల కలలు ప్రతి ఒక్కరికీ వస్తాయి. ఆ కల కంటున్నంత సేపు అది నిజం అని అనిపిస్తుంది, నిజంగా జరుగుతున్నట్టుగా ఉంటుంది.

ఆ కలలో సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. కానీ నిద్రలో ఉండగా ఎవరో మిమ్మల్ని లేపితే, మీరు మేల్కొని, "అరే! ఇది కలా?" అని ఆశ్చర్యపోతారు, ఒక క్షణం ముందు వరకు అది నిజమే అనుకున్నారు, కానీ మేల్కొన్న వెంటనే అది కల అని తెలిసిపోతుంది.

అది దుఃఖం కలిగించే కల అయితే, మీరు ఎంతో రిలాక్స్ అవుతారు. ఆనందం కలిగించే కల అయితే ఎంతో బాధపడతారు. ఉదాహరణకు, మీరు ఒక కోటీశ్వరుడిగా కల కంటున్నారని అనుకుందాం. పెద్ద పెద్ద వ్యాపారాలు ఉన్నాయి, కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు, విమానాల్లో ప్రయాణిస్తున్నారు, ఎంతోమందిపై అధికారం ఉంది, అటువంటి వైభవమైన జీవితం జీవిస్తున్నారు.

ఆ కలలో మీ జీవితాన్ని చూసుకుని ఎంతో మురిసిపోతారు, "నాకెంత గొప్ప జీవితం ఉంది!" అని పొంగిపోతారు. ఇంతలో మీ భార్యగానీ, భర్తగానీ మిమ్మల్ని నిద్ర లేపుతారు. కళ్లు తెరిచి చూస్తే ఏమీ లేదు, కోట్లు లేవు, వ్యాపారాలు లేవు, మీరు ఒక చిన్న ఉద్యోగం చేసుకుంటూ సాధారణ జీవితమే గడుపుతున్నారు.

అప్పుడు మీరు ఆశ్చర్యపోతారు. "అరే! ఇన్ని కోట్లు ఉన్నవాడిని అనుకున్నాను, ప్యాలెస్‌లాంటి భవనంలో ఉన్నాను అనుకున్నాను, కానీ ఇప్పుడు

చిన్న ఇంట్లో ఉన్నాను, ఆ ఇల్లు ఏమైంది?" అని అనుకుంటారు. వెంటనే అది కల  అని అర్థమవుతుంది, ఎంతో బాధపడతారు.

అలాగే ఇంకొకరు ఎవరితోనే గొడవపడి, వారిని చంపినట్టుగా కల కంటారు. పోలీసులు అరెస్ట్ చేసినట్టుగా, కోర్టు శిక్ష వేసినట్టుగా, జైలులో పెట్టినట్టుగా అనుభవిస్తారు. జైలులో తోటి ఖైదీలతో గొడవలు, పోలీసుల వేధింపులు అన్నీ అనుభవిస్తున్నట్టుగా ఉంటుంది. "నా జీవితం ఇలా అయిపోయిందేంటి?" అని బాధపడతారు, "ఇంకా పది సంవత్సరాలు, పదిహేను సంవత్సరాలు జైలులో ఉండాలా?" అని తీవ్ర దుఃఖంలో ఉంటారు. ఇంతలో ఎవరో నిద్ర లేపుతారు, కళ్ళు తెరిచి చూస్తే జైలు లేదు, శిక్ష లేదు, పోలీసులు లేరు. అప్పుడు ఎంత సంతోషిస్తారో చూడండి! "అమ్మయ్య! ఇదంతా కలేనా?" అని ఊపిరి పీల్చుకుంటారు. కలలో ఉన్నంత సేపు శిక్ష నిజంగానే అనిపించింది, కానీ కల నుంచి బయటకు వచ్చిన తర్వాత అది కేవలం కల మాత్రమే అని తెలిసింది, వెంటనే బాధ అంతా పోయింది.

ఇక్కడ ఒక విషయం అర్థం చేసుకోవాలి. సంతోషం కలిగించిన కలలోనూ, బాధ కలిగించిన కలలోనూ మేల్కొన్న తర్వాత రెండూ కలలేనని తెలుస్తుంది. అప్పుడు సంబరపడాల్సిన అవసరం లేదని, బాధపడాల్సిన అవసరం లేదని అర్థమవుతుంది. కోటీశ్వరుడిగా ఉన్నానని కలలో ఎంతో సంబరపడ్డారు, మేల్కొన్నాక అది కలే కదా అని తెలిసింది. జైలులో ఉన్నానని కలలో ఎంతో బాధపడ్డారు, మేల్కొన్నాక అది కూడా కలే అని తెలిసింది.

ఇది ఎందుకు చెబుతున్నానంటే, ఇప్పుడు మీరు అనుభవిస్తున్న ఈ జీవితం కూడా ఒక కలలాంటిదే అని గుర్తుంచుకోవాలి. మీరు దీనిని నిజం అనుకుంటున్నారు, అందుకే బాధలు వచ్చినప్పుడు బాధపడుతున్నారు, భోగాలు వచ్చినప్పుడు సంబరపడుతున్నారు. కానీ ఇది కూడా ఒక కలలాంటిదే అని తెలుసుకుంటే, అధికంగా సంబరపడాల్సిన అవసరం ఉండదు, అధికంగా బాధపడాల్సిన అవసరం కూడా ఉండదు. "ఇదేంటండి? ఇది ఎలా కల

అవుతుంది? నిజంగానే జరుగుతుంది కదా? నాకు యాక్సిడెంట్ అయింది, నేను ఆసుపత్రిలో చేరాను, నొప్పి అనుభవించాను" అని మీరు అనవచ్చు. అవును, అనుభవం నిజంగానే ఉంటుంది. కానీ ఆత్మ దృష్టిలో చూస్తే, ఇవన్నీ తాత్కాలిక అనుభవాలే, అందుకే జ్ఞానులు ఈ జీవితాన్ని ఒక కలతో పోలుస్తారు.

అందుచేత మీకు భోగాలు వచ్చాయని పొంగిపోవద్దు, కష్టాలు వచ్చాయని కుంగిపోవద్దు, ఇది ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. మీరు కోట్లు సంపాదించారని అతిగా సంబరపడటానికీ లేదు, జీవితంలో కొన్ని సంఘటనలు జరిగాయని తీవ్రంగా బాధపడటానికి లేదు. నేను చాలా చోట్లకు వెళ్లినప్పుడు కొందరు ఇలా చెబుతుంటారు "భర్త నన్ను వదిలేశాడు, ఇంకొకరితో వెళ్ళిపోయాడు. ఇప్పుడు నేను ఒంటరిగా పిల్లలను పెంచుకుంటున్నాను, చాలా కష్టంగా ఉంది, ఆయన మళ్లీ నా దగ్గరకు వస్తాడా?" అని అడుగుతుంటారు.

మరికొందరు భర్తలు కూడా తమ భార్యల గురించి ఇలాంటి బాధలను చెబుతుంటారు. ఇలాంటి సంఘటనలు జీవితంలో జరుగుతూనే ఉంటాయి. కానీ మీరు ఒక విషయం గుర్తుంచుకోవాలి, ప్రస్తుతం జరుగుతున్న ఈ జీవితం కూడా ఒక కలలాంటిదే, కలలో మీరు మేల్కొంటే అది కల అని తెలుస్తుంది. అలాగే మరణించిన తర్వాత, ఇది కూడా ఒక కలలాంటిదే అని అర్థమవుతుంది. కల కంటున్నప్పుడు కళ్ళు తెరిస్తే అది కల అని తెలుస్తుంది, అలాగే ఆధ్యాత్మిక జీవితంలో మీ మూడో కన్ను తెరుచుకుంటే, ఈ జీవితం కూడా ఒక కలలాంటిదని అర్థమవుతుంది.

అందుచేత ఇది కలలాంటి జీవితం అని గ్రహించాలి, ఇది మాత్రమే శాశ్వత సత్యం కాదు అని తెలుసుకోవాలి. కల ఉన్నంత సేపు అది నిజమని అనిపిస్తుంది, మేల్కొన్న తర్వాత అది కల అని తెలుస్తుంది. అలాగే ఈ జీవితం కొనసాగుతున్నంత సేపు ఇది నిజమని అనిపిస్తుంది, కానీ మరణించిన తర్వాత దీని అసలు స్వరూపం అర్థమవుతుంది.

అప్పుడు కొందరు ఎంతో రిలాక్స్ అవుతారు, కొందరు బాధపడతారు.

అందుకే మరణానంతర జీవితాన్ని గురించి తెలుసుకుంటూ ఉంటే, ప్రస్తుతం మీరు జీవిస్తున్న జీవితాన్ని కొత్త దృష్టితో చూడగలుగుతారు. మీరు ఎప్పటికప్పుడు ఇది గుర్తు చేసుకుంటూ ఉండండి. ఏం జరుగుతున్నా, ఏం చేస్తున్నా, "ఇది ఒక కలలో జరుగుతున్నట్టిదే" అని భావించగలరా? అలా భావిస్తే మీకు చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది. "ఎలా అనుకుంటామండి? ఇది కల అని ఎలా అనుకోగలము?" అని మీరు అడగవచ్చు. కానీ మీరు అనుకున్నా, అనుకోకపోయినా ఈ జీవితం ఒక కలలాంటిదే. అది మీకు పూర్తిగా అర్థం కావాలంటే రెండు మార్గాలే ఉన్నాయి. ఒకటి మీరు మరణించాలి, లేకపోతే మీ మూడో కన్ను, తెరుచుకోవాలి. ఈ రెండింటిలో ఏదో ఒకటి జరిగితేనే ఈ సత్యం పూర్తిగా అర్థమవుతుంది.

అందుచేత తట్టుకోలేని దుఃఖం వచ్చిందని అతిగా బాధపడవలసిన పని లేదు, అంతులేని భోగాలు వచ్చాయని అతిగా సంబరపడవలసిన అవసరం కూడా లేదు. ఒక విషయం గుర్తుంచుకోండి, కలలో జరిగే సంఘటనలకు మీరు ఎంతగా స్పందిస్తారు? ఉదాహరణకు, మీ భర్తకు తీవ్రమైన అనారోగ్యం వచ్చి మంచం మీద పడితే మీరు ఎంతో బాధపడతారు. కానీ అది కల మాత్రమే అని తెలిసిన క్షణంలోనే మీరు రిలాక్స్ అవుతారు.

అలాగే, మీకు కోట్లాది రూపాయలు ఉన్నట్టుగా, అపారమైన భోగాలు ఉన్నట్టుగా అనిపించినా, అది కూడా కలలో భాగమే అయితే దాని గురించి ఎందుకు పొంగిపోవాలి? "ఇది కూడా ఒక కలలాంటిదే" అని భావించగలిగితే, ఉన్నాయని పొంగిపోరు, లేవని బాధపడరు. మీ జీవితం కూడా అంతే. అది రాత్రి కల అయితే, ఇది పగటి కల. కల నిజం కాదు, అయితే ఈ జీవితం ఎందుకు ఉంది? అనుభవాలు సంపాదించడానికి, పాఠాలు నేర్చుకోవడానికి మీరు భూమి పైకి వచ్చారు. అందుకే ఈ దేహాన్ని తీసుకున్నారు, ఇది శాశ్వతం కాదు, ఒకరోజు విడిచిపెట్టాల్సిందే.

ఈ విషయాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. మరణించిన తర్వాత

తెలుసుకునే విషయాలను జీవించి ఉండగానే తెలుసుకోగలిగితే, మీకు ఎన్నో విషయాలు స్పష్టంగా అర్థమవుతాయి. అందుకే పత్రి గారు, **"జ్ఞాని మరణించక ముందే మరణిస్తాడు"** అని చెప్పారు. దాని అర్థం ఏమిటంటే, మరణించిన తర్వాత తెలుసుకునే సత్యాలను జీవించి ఉండగానే తెలుసుకుంటాడు అని. అది జ్ఞానికే సాధ్యం, అందుకే మీరు జ్ఞానం సంపాదించుకోవాలి. జ్ఞానం పెరిగే కొద్దీ ఏది వాస్తవమో, ఏది అవాస్తవమో, ఏది సత్యమో, ఏది అసత్యమో స్పష్టంగా తెలుసుకుంటారు. ముందుగా జ్ఞానం సంపాదించాలి, అప్పుడు మీ భ్రమలు, భ్రాంతులు క్రమంగా తొలగిపోతాయి.

అందుచేత పత్రి గారు అయినా, నేను అయినా చెప్పేది ఒక్కటే జ్ఞానం సంపాదించుకోండి, ఏవో నిజమని భావించి వాటి గురించి అనవసరంగా ప్రాకులాడవద్దు. మీరు ఎంత జ్ఞానం పెంచుకుంటే అంత వాస్తవానికి దగ్గరవుతారు, సరైన విధంగా జీవిస్తారు, చేయకూడని పనులు చేయరు, చేయవలసిన పనులనే చేస్తారు. మరణానంతర జీవితం గురించి అవగాహన జ్ఞానికి బాగా ఉంటుంది. "నేను మాయా ప్రపంచంలో ఉన్నాను, మాయలో జీవిస్తున్నాను, ఈ జీవితం కలలాంటిది" అనే ఎరుక అతనికి ఎప్పుడూ ఉంటుంది. అందువల్ల అతను అవసరం లేని విషయాలకు ఎక్కువగా బాధపడడు, అనవసరంగా పొంగిపోడు, సమత్వంతో జీవిస్తాడు.

అందుచేత ఈ విషయాలను చనిపోయిన తర్వాత తెలుసుకోవడం కాదు, ఇప్పుడే తెలుసుకోవాలి. చనిపోయిన తర్వాత తెలుసుకున్నా, అప్పుడు వాటిని ఆచరణలో పెట్టే అవకాశం ఉండదు, ఇప్పుడే తెలుసుకోండి. ప్రస్తుతం జరుగుతున్న ఈ జీవితం కలలాంటిదే, ఇదే వాస్తవం కాదు, ఇది శాశ్వత సత్యం కాదు. ఈ మాటలు మీకు ఆశ్చర్యం కలిగించవచ్చు. ఈ విషయాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని, వాటికి అనుగుణంగా జీవించడానికి ప్రయత్నించండి, లేకపోతే "ఇలా అయిపోయిందే నా జీవితం" అని కుమిలిపోతూ ఉంటారు. కానీ జ్ఞానికి అర్థమవుతుంది "ఇది కూడా ఒక కలలాంటిదే, ఇది శాశ్వత సత్యం కాదు" అని.

# ఇప్పటి వరకు నేను జీవించిన విధానం తప్పు

మరణానంతర జీవితం గురించి తెలుసుకోక ముందు మీరు ఎలా జీవిస్తారో, తెలుసుకున్న తర్వాత మీ జీవన విధానం పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే మరణానికి ముందు, మరణం తర్వాత తెలిసే వాటికి చాలా తేడా ఉంటుంది. ఈ విషయం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

మరణానికి ముందు మనిషి మాయ ప్రభావంలో జీవిస్తాడు. మాయలో ఉండి చేసే పనులన్నీ సరైనవేనని అనిపిస్తాయి, కానీ మరణం తర్వాత వాటిని పరిశీలించినప్పుడు, తాను ఎంత తప్పుదోవలో జీవించాడో అర్థమవుతుంది. జీవిస్తున్నప్పుడు తాను కరెక్ట్‌గానే ఉన్నానని భావించినా, మరణం తర్వాత **"ఇప్పటివరకు నేను జీవించిన విధానం చాలా తప్పు"** అని తెలుసుకుంటాడు.

అప్పుడు కొంత బాధ కూడా కలుగుతుంది. "నేను ఇంత తప్పుగా ఎందుకు జీవించాను? ఇలా కాకుండా జీవించి ఉండాల్సింది" అనే ఆలోచనలు వస్తాయి. మరణం తర్వాత జరిగే కౌన్సిలింగ్‌లో ఇలాంటి విషయాలన్నీ చర్చించబడతాయి. ఉన్నత లోకాలైన మహాలోకం, తపోలోకం వంటి స్థాయిలలో ఉన్న ఉన్నత ఆత్మలతో చర్చలు జరుగుతాయి. ఆ సమయంలో అనేక సందేహాలు నివృత్తి అవుతాయి, జీవితంలో జరిగిన అనేక విషయాలకు సమాధానాలు లభిస్తాయి.

ప్రకృతి ఏర్పాటు ఎంత అద్భుతమైనదంటే, భూమిపై అజ్ఞానంలో ఉన్న వారికి సద్గురువుల ద్వారా బోధించడం జరుగుతుంది. మరణించిన తర్వాత కూడా ఉన్నత లోకాలలో ఉన్న మాస్టర్లు బోధిస్తూ ఉంటారు. ఇవన్నీ ఆత్మలైన మీరు ఎదగడానికే ప్రకృతి చేసిన ఏర్పాట్లు.

మూలాత్మ మిమ్ములను సృష్టించి వదిలేయదు. ఎప్పటికప్పుడు సరిదిద్దుతూ, నేర్పిస్తూ, వివిధ మార్గాల ద్వారా మార్గ నిర్దేశం చేస్తూ ఉంటుంది. ఎందుకంటే అంశాత్మ పూర్ణాత్మ స్థాయికి ఎదగడం సాధారణ విషయం కాదు. పూర్ణాత్మ అంటే సృష్టికి ప్రతిసృష్టి చేయగల స్థితి. అలాంటి స్థాయికి చేరుకోవాలంటే అపారమైన జ్ఞానం అవసరం. ఈ సృష్టిలో 84 లక్షల జీవులు, జీవరాశులు ఉన్నాయి. వాటిని సృష్టించడం వెనుక ఉన్న గొప్పతనం ఒక్కసారి ఆలోచించండి.

మీరు చూడండి, జలచరాలలో ఎన్నో కొత్త కొత్త రకాలను చూపిస్తూ ఉంటారు. చాలామంది సముద్రంలోకి వెళ్ళి వాటిని పరిశీలిస్తూ ఫోటోలు తీసి, ఇప్పుడు యూట్యూబ్‌లో కూడా పంచుకుంటున్నారు. ఎప్పుడూ చూడని జీవులను చూసినప్పుడు మీకు ఆశ్చర్యం కలుగుతుంది. “ఇలాంటి జీవులను ఇంతకుముందు ఎప్పుడూ చూడలేదే!” అని అనిపిస్తుంది.

మీరు చేపలనే ఉదాహరణగా తీసుకున్నట్లయితే, వాటిలో ఎన్ని రకాలు ఉంటాయో ఆలోచించండి. వందలు కాదు, వేల రకాల చేపలు ఉన్నాయి. అంటే ఒక్కో పూర్ణాత్మ ఒక్కో రకమైన చేపను సృష్టించింది. అలాగే మీరు కూరగాయలు, పండ్లలో కూడా ఇదే వైవిధ్యం కనిపిస్తుంది.

ఒక మామిడి పండును తీసుకున్నట్లయితే, అందులోనే ఎన్ని రకాలు ఉన్నాయో చూడండి. ఒక పూర్ణాత్మ ఒక రకమైన మామిడిని సృష్టిస్తే, మరో పూర్ణాత్మ తన అనుభవం, జ్ఞానం ఆధారంగా అదే మామిడిని మరో రూపంలో సృష్టిస్తుంది. దాని ఆకారం మారుతుంది, రుచి మారుతుంది, రంగు మారుతుంది, పరిమాణం మారుతుంది. ఇలా ఎన్నో భేదాలు ఏర్పడుతూ ఉంటాయి.

అలా 84 లక్షల జీవరాశులు ఉన్నాయని చెప్పినప్పుడు, దాని వెనుక

ఉన్న అపారమైన సృష్టి వైవిధ్యాన్ని మీరు అర్థం చేసుకోవాలి. ఇంతటి సృష్టిని రూపొందించాలంటే ఎంత నేర్చుకోవాలి, ఎంత జ్ఞానం సంపాదించాలి, ఎంత అనుభవం పొందాలి అనేది ఆలోచించండి. అందుకే ఆ స్థాయికి ఎదగడానికి అనుగుణమైన ఏర్పాట్లు, అవకాశాలు, అనుభవాలు ఈ సృష్టిలో నిరంతరం కల్పించబడుతూ ఉంటాయి.

అందుకే ఈ సృష్టిలో ఆత్మ ఎదుగుదలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయి. భూమి పైకి రావడం కేవలం ఆనందించడానికే కాదు, నేర్చుకోవడానికే. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్నవారు ప్రతి సంఘటన నుంచి నేర్చుకోవడానికి ప్రయత్నిస్తారు. మంచి జరిగితే సంబరపడరు, చెడు జరిగితే బాధపడరు. “ఇది ఎందుకు జరిగింది? దీని ద్వారా నేను ఏమి నేర్చుకోవాలి?” అని ఆలోచిస్తారు. ప్రతి సంఘటన ఒక పాఠం, ప్రతి అనుభవం ఒక అవకాశం. కేవలం ఎంజాయ్ చేయడానికి జీవించే వ్యక్తి జన్మలను పెంచుకుంటాడు. నేర్చుకోవడానికి జీవించే వ్యక్తి జన్మలను తగ్గించుకుంటాడు, తెలివైనవాడు ప్రతి సంఘటన నుంచి ఒక పాఠాన్ని తీసుకుంటాడు.

ఎందుకంటే మీరు భూమి పైకి వచ్చిన ప్రధాన ఉద్దేశ్యం నేర్చుకోవడమే. నేర్చుకోకుండా ఇంకేమి చేయగలరు? సంపదలు, సుఖాలు, వినోదాలు ఇవన్నీ తాత్కాలికమైనవి, కానీ జ్ఞానం మాత్రమే ఆత్మతో పాటు ప్రయాణిస్తుంది, మీరు ఎంజాయ్ చేయడం గొప్ప కాదు.

ఒక సెల్‌ఫోన్ తీసుకుని దానితో ఎంతో ఆనందించవచ్చు. కానీ నిజంగా గొప్పవాడు ఎవరు అంటే, ఆ సెల్‌ఫోన్‌ను సృష్టించిన వ్యక్తి. అతని మేధస్సు వల్ల కోట్లాది మంది ప్రయోజనం పొందుతున్నారు.

అది మాత్రమే కాదు, పూర్ణాత్మలు కేవలం జీవరాశులను మాత్రమే కాదు, లోకాలను కూడా సృష్టిస్తూ ఉంటారు. ఈ సృష్టిలో కోటానుకోట్ల లోకాలు

ఉన్నాయని పత్రి గారు చెబుతూ ఉంటారు. భూలోకాలే అనేకం ఉన్నాయని చెబుతారు, ఎందుకంటే ఈ విశ్వం ఆది అంతాలు లేనిది, అందులో అపారమైన సృష్టి జరుగుతూ ఉంటుంది.

పూర్ణాత్మ స్థితికి చేరుకున్న అనేక మంది తమ జ్ఞానం, అనుభవం, మేధస్సుతో కొత్త కొత్త సృష్టులను రూపొందిస్తూ ఉంటారు. కొంతమంది "పూర్ణాత్మ అయ్యాక, మోక్షం పొందాక ఇంకేం చేయాలి?" అని అడుగుతారు. కానీ ఆ స్థాయికి చేరుకున్న తర్వాత కూడా చేయవలసిన కార్యాలు ఉంటాయి. వారు ఖాళీగా ఉండరు. సృష్టిలో కొత్త సృష్టులను రూపొందిస్తూ ఉంటారు.

సీతాకోకచిలుకలను చూడండి, ఎన్నో రకాలు ఉన్నాయి. పాములను చూడండి, ఎన్నో రకాలు ఉన్నాయి. అలాగే అనేక జీవరాశులు ఉన్నాయి. ఇంత వైవిధ్యమైన సృష్టిని చేయగలిగే పూర్ణాత్మ స్థాయికి ఎదగడం అంత తేలికైన విషయం కాదు.

చాలామంది దేవుణ్ణి ప్రార్థిస్తే, కీర్తిస్తే, దండం పెడితే మోక్షం వచ్చేస్తుందని అనుకుంటారు. కానీ మోక్షం అంటే జన్మ లేని స్థితి, అంటే పూర్ణాత్మ స్థితి. అది ఎవరైనా ఇచ్చేది కాదు, ఎవరికి వారు ఆ స్థాయికి ఎదిగినప్పుడు స్వయంగా వచ్చే స్థితి.

అర్హత లేని వ్యక్తిని ఉన్నత స్థానంలో కూర్చోబెట్టడం వల్ల ప్రయోజనం ఉండదు. కుక్కను సింహాసనం మీద కూర్చోబెడితే అది రాజ్యాన్ని పాలించలేదు, రాజుగా పరిపాలించాలంటే రాజధర్మం, విద్య, అనుభవం ఉండాలి. అందుకే పూర్వం రాజులు తమ వారసులకు సకల విద్యలను నేర్పించేవారు. భవిష్యత్తులో రాజ్యాన్ని నిర్వహించే బాధ్యత వారిదే కాబట్టి కఠినమైన విద్యలను కూడా అభ్యసింపజేసేవారు.

అలాగే మూలాత్మలు, పూర్ణాత్మలు కూడా మానవులకు ఎన్నో

విషయాలు నేర్పించే ప్రయత్నం చేస్తూ ఉంటాయి. భూమిపై ఉన్నప్పుడు కొంత జ్ఞానాన్ని నేర్చుకుంటారు. కానీ తరువాత ఇంకా ఎన్నో లోకాలు ఉన్నాయని, వాటిలో కూడా ఎన్నో విషయాలు నేర్చుకోవాల్సి ఉంటుందని తెలుస్తుంది.

ఒక ఆత్మ పూర్ణాత్మ స్థితికి చేరుకోవడానికి కోట్ల సంవత్సరాలు పడుతుంది. అనేక శరీరాలలో, అనేక జీవరాశులలో జన్మించి, అనేక అనుభవాల ద్వారా నేర్చుకుంటూ ఎదుగుతుంది, చివరకు మానవ జన్మను పొందుతుంది. మానవునికి బుద్ధి ఉంటుంది కాబట్టి ఆ బుద్ధిని ఉపయోగించి మరింత జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు.

అందువల్ల మీరు ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. భూమి పైకి కేవలం సుఖాలను అనుభవించడానికి, ధనం సంపాదించడానికి మాత్రమే రాలేదు. చాలామంది జీవిత లక్ష్యం సంపాదించడం, అనుభవించడం మాత్రమే అనుకుంటారు. కానీ మానవ జీవితపు అసలు ఉద్దేశ్యం జ్ఞానం సంపాదించడం మరియు అనుభవాల ద్వారా ఎదగడం.

ఎంత ఎక్కువగా నేర్చుకుంటే అంత వేగంగా ఆధ్యాత్మికంగా ఎదగగలుగుతారు. దాని వల్ల అనేక జన్మలు తగ్గుతాయి. ఎందుకంటే మరణించిన తర్వాత ఎన్నో విషయాలు తెలుస్తాయి. వాటి గురించి అవగాహన లేకపోతే పూర్ణ జ్ఞాని కాలేరు.

# “భూలోకం రాత్రి, పైలోకం పగలు”

మరణానంతరం తెలుసుకునే ఆశ్చర్యకరమైన విషయాలలో ఒకటి **“భూలోకం రాత్రి, పైలోకం పగలు”**

ఇది వినగానే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. కానీ దాని అర్థం ఏమిటంటే, కనిపించేది పగలు, కనిపించనిది రాత్రి. చీకటిలో టేబుల్ మీద వస్తువు ఉన్నా కనిపించదు, వెలుతురు వచ్చినప్పుడు అది స్పష్టంగా కనిపిస్తుంది, అందుకే వెలుతురును పగలు అంటారు.

అలాగే భూమిపై ఉన్నప్పుడు ఆత్మలు మీకు కనిపించవు, శరీరంలో ఉన్న ఆత్మ కనిపించదు, శరీరాన్ని విడిచిన ఆత్మలు కూడా కనిపించవు. అందువల్ల భూమి రాత్రిలాంటిది. కానీ పై లోకాలకు వెళ్ళినప్పుడు ఆత్మలు స్పష్టంగా కనిపిస్తాయి. అందుకే దానిని పగలు అంటారు. అక్కడికి వెళ్ళిన తర్వాత, “భూమిపై ఉన్నప్పుడు ఇవన్నీ నాకు ఎందుకు కనిపించలేదు?” అని ఆశ్చర్యపడతారు.

ఇప్పటి వరకు భూమిపైనే పగలు అనుకున్న వ్యక్తికి, తరువాత అది రాత్రి అని అర్థమవుతుంది. పై లోకానికి చేరిన తర్వాత ఎన్నో విషయాలు స్పష్టంగా తెలుస్తాయి. ఎన్నో లోకాలు ఉన్నాయని తెలుస్తుంది, అనేక జీవులు, ఆత్మలు ఉన్నాయని తెలుస్తుంది.


భూమిపై చేసిన ప్రతి కర్మ నమోదు అవుతుందని కూడా అక్కడికి వెళ్ళాక అర్థమవుతుంది. ప్రతి ఆలోచన, ప్రతి చర్యకు ఫలితం ఉంటుందని స్పష్టంగా తెలుస్తుంది. ఈ విషయాలు తెలిసినప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. భూమిపై ఉన్నప్పుడు భూలోకం ఒక్కటే నిజమని అనిపిస్తుంది. కానీ పై లోకానికి వెళ్ళిన తర్వాత ఇన్ని లోకాలు ఉంటాయా అని ఆశ్చర్యపోతారు.

అయితే భూమినే పగలుగా మార్చుకోవచ్చు. అది ఎవరికి సాధ్యం?

జ్ఞానం సంపాదించినవారికి సాధ్యం. అజ్ఞానంలో ఉన్నవారికి భూమి రాత్రిలాంటిది. జ్ఞానవంతుడికి భూమిపైనే ఎన్నో సత్యాలు స్పష్టంగా కనిపిస్తాయి. అందుకే జ్ఞానం అత్యంత విలువైనది. కేవలం సుఖాల కోసం జీవించడం కాదు, సత్యాన్ని తెలుసుకోవడానికి జీవించడం మానవ జన్మ యొక్క గొప్ప ఉద్దేశ్యం.

అనేక జన్మల అనుభవాల తర్వాతే "ఇక ఈ బాధలు, ఈ సంసార చక్రం చాలును" అనే వైరాగ్యం కలుగుతుంది. అప్పుడు గురువును వెతుకుతారు. గురువును ఆశ్రయించి జ్ఞాన మార్గంలో నడవడం ప్రారంభిస్తారు.

అందువల్ల మీరు గుర్తుంచుకోవాల్సిన విషయం "అజ్ఞానంలో ఉన్నవారికి భూలోకం రాత్రి, జ్ఞానంతో జీవించే వారికి భూలోకం పగలు". మరణానంతరం అనుభవించే సత్యాలను, జ్ఞాని జీవించి ఉన్నప్పుడే తెలుసుకుంటాడు.

బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

రిజిస్ట్రేషన్ కొరకు : **సింధూర, సెల్: 8555995217**

# ఆధ్యాత్మిక మార్గం పీతల గంపలో పైకి ఎక్కే ప్రయత్నం లాంటిది

ఒక విషయం గుర్తుంచుకోండి. ప్రతి ఒక్కరూ జీవితంలో రకరకాల పరిస్థితుల్లో ఉంటారు. సమస్యలు ఉంటాయి, మమకారాలు ఉంటాయి, బంధాలు ఉంటాయి, అడ్డంకులు ఉంటాయి, ఇబ్బందులు ఉంటాయి, బాధ్యతలు ఉంటాయి. ప్రాపంచిక జీవితంలో ఇవన్నీ సహజం. ఇవి లేకుండా జీవితం ఉండదు.

అయినా సరే, మీరు ఎన్నో జన్మలు తీసుకుని, ఎన్నో అనుభవాలు పొంది, ఎన్నో విషయాలు నేర్చుకుని, ఎంతో మంది గురువుల దగ్గర విద్యను అభ్యసించి, ఎన్నో గ్రంథాలు చదివి ఇక్కడికి వచ్చారు. అందువల్ల ఈ మార్గంలోకి వచ్చిన మీరు సామాన్యులు కాదు. మీరు అసామాన్యులు. ఎందుకంటే ప్రతి ఒక్కరూ సద్గురువు మార్గంలోకి రారు.

ఈ రోజుల్లో ధ్యానం కూడా వినోదంగా మారిపోతోంది. పెద్ద పెద్ద శబ్దాలతో సంగీతం పెట్టి, నృత్యాలు చేయించి, దానినే ధ్యానం అని భావిస్తున్నారు. కానీ ధ్యానం మరియు జ్ఞానం యొక్క అసలు లక్ష్యం వినోదం కాదు.

మీరు ఒకసారి ఆలోచించండి. ఈ ఒక్క జన్మలోనే సుఖాలు, సంసారం, బంధాలు, భోజనాలు, వినోదాలు అనుభవిస్తున్నట్లు భావిస్తున్నారు. కానీ ఇలాంటి అనుభవాలు మీరు ఎన్నో జన్మలలో పొందారు. ఈ ఒక్క జన్మలోనే సంసారం ఉన్నట్టు, భర్త ఉన్నట్టు, భార్య ఉన్నట్టు, పిల్లలు ఉన్నట్టు, కూతురు ఉన్నట్టు, కొడుకు ఉన్నట్టు, కష్టాలు ఉన్నట్టు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్టు అనుకోవద్దు. మీరు ఇప్పుడు తింటున్న ఆహారాలు కూడా మొదటిసారి తింటున్నవి కావు. ఎన్నో జన్మలు గడిచిన తరువాతే మీరు ఈ జన్మకు వచ్చారు. కానీ ఈ విషయం మీకు పూర్తిగా అర్థం కావడం లేదు, నేను ఎంత చెప్పినా

ఈ సత్యం మీకు అర్థం కావడం లేదు.

ప్రాపంచిక జీవితంలో సుఖాలు, దుఃఖాలు, కష్టాలు, సమస్యలు అన్నీ ఉంటాయి, ఏమీ లేకుండా జీవితం ఉండదు. అయితే అవి ఉన్నప్పటికీ, మీరు మీ కృషి ద్వారా, మీ పట్టుదల ద్వారా, మీ శ్రద్ధ ద్వారా నిరంతరం ఎదుగుతూ ఉండాలి. కొద్ది కొద్దిగా అయినా అభివృద్ధి సాధిస్తూ, జ్ఞాన పరంగా మరియు ఆధ్యాత్మికంగా ముందుకు సాగుతూ ఉండాలి.

ఈ మార్గంలోకి వచ్చిన వారందరూ పీతల గంపలో ఉన్న పీతల వంటి వారు. ఒక పీత గంప నుండి బయటపడటానికి పైకి ఎక్కాలని ప్రయత్నిస్తుంటే మిగిలిన పీతలు దానిని క్రిందకి లాగుతూ ఉంటాయి. అది మళ్ళీ పైకి వెళ్ళడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. మళ్ళీ ఇంకో పీత క్రిందకు లాగుతూ ఉంటుంది. ఇలా జరుగడంవల్ల ఆ పీత పైకి ఎప్పటికీ చేరుకోలేదు.

అలాగే మీరు కూడా ఆధ్యాత్మికంగా ఎదగాలని ప్రయత్నిస్తున్నప్పుడు, ఏదో ఒక సమస్య, ఏదో ఒక బాధ, ఏదో ఒక అడ్డంకి, ఏదో ఒక పరిస్థితి మిమ్మల్ని వెనక్కి లాగడానికి ప్రయత్నిస్తుంది. అది కుటుంబ సమస్య కావచ్చు, ఆర్థిక ఇబ్బంది కావచ్చు, సమాజ ప్రభావం కావచ్చు లేదా ఇతర బాధ్యతలు కావచ్చు.

ఉదాహరణకు, మీరు సాధన చేయాల్సిన సమయంలో కూతురు ఇంటికి వచ్చింది అనుకుందాం. అప్పుడు మీరు సాధనను మానేయకూడదు. "రెండు గంటలు మీ సాధనా సమయం, సాధన పూర్తయిన తర్వాత నేను నీతో మాట్లాడుతాను" అని నిక్కచ్చిగా కూతురుకు చెప్పగలగాలి.

ఇక్కడ కూతురు అనేది ఒక పీత లాంటిది, ఉద్యోగం ఇంకొక పీత కావచ్చు, ఇంకొకరికి వ్యాపారం ఇంకొక పీత కావచ్చు, మరొకరికి ఆరోగ్య సమస్య ఇంకొక పీత కావచ్చు. అలా ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మికంలో వెనక్కిలాగే కారణాలు వేర్వేరుగా ఉంటాయి.

ఒక పీతను దాటితే మరో పీత ఎదురవుతుంది, ఒక సమస్య పోతే

మరో సమస్య వస్తుంది. కాబట్టి సమస్యలు పూర్తిగా పోయిన తర్వాత సాధన చేస్తాను అని అనుకంటే ఎప్పటికీ ఆధ్యాత్మికంగా మీరు ఎదగలేరు. ఈ పీతలన్నింటినీ అధిగమించాలంటే, మీరు పైకి వెళ్ళాలన్న గట్టి సంకల్పం, మిమ్మల్ని వెనక్కి లాగే పరిస్థితుల కంటే బలంగా ఉండాలి. మీరు అలా బలంగా ఉంటే ఏ సమస్య కూడా మిమ్మల్ని ఆపలేను.

మీరు బలహీనంగా ఉంటే చిన్న సమస్య కూడా మిమ్మల్ని వెనక్కి లాగుతుంది. కానీ మీరు శక్తిని పెంచుకుంటే పెద్ద సమస్య కూడా మీ పురోగతిని ఆపలేదు. కొంత మందికి కుటుంబ బాధ్యతలు అడ్డంకిగా ఉంటాయి, కొంత మందికి ఉద్యోగం అడ్డంకిగా ఉంటుంది, కొంత మందికి వ్యాపారం, ఆరోగ్యం లేదా ఇతర పరిస్థితులు అడ్డంకిగా ఉంటాయి. కానీ ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఇలాంటి పరీక్షలు తప్పవు.

ఆధ్యాత్మిక మార్గంలో ఉండటం అంటే పీతల గంప నుంచి పైకి రావడానికి ప్రయత్నించడం లాంటిది. పీతల గంపలో ఒక పీత పైకి ఎక్కాలని ప్రయత్నిస్తే, మిగతా పీతలు దానిని వెనక్కి లాగుతాయి. అలాగే ఆధ్యాత్మిక మార్గంలో కూడా మీరు ఎదగాలని ప్రయత్నించినప్పుడు ఎన్నో అడ్డంకులు, సమస్యలు, పరిస్థితులు మిమ్మల్ని వెనక్కి లాగడానికి ప్రయత్నిస్తాయి.

అయితే మీరు ఎన్నిఉన్నా పట్టుదలతో పీతలను అధిగమించాలి. వాటిని అధిగమించాలంటే, పైకి ఎదగాలనుకునే పీత బలంగా ఉండాలి. అదే విధంగా మీరు కూడా ఎన్ని సమస్యలు వచ్చినా వాటిని ఎదుర్కొని అధిగమించగలిగేంత మానసిక, ఆధ్యాత్మిక శక్తిని పెంచుకోవాలి. మీరు బలంగా ఉంటే ఏ సమస్యా మిమ్మల్ని అడ్డుకోలేదు, ఏ అడ్డంకీ మిమ్మల్ని వెనక్కి ఆపలేదు.

కానీ మీరు బలహీనంగా ఉంటే చిన్న చిన్న సమస్యలే మిమ్మల్ని వెనక్కి లాగేస్తాయి. ఒక సమస్య పోతే మరొక సమస్య ఎదురవుతుంది, ఎందుకంటే జీవితంలో సమస్యలకు అంతం ఉండదు. కాబట్టి సమస్యలు లేకుండా జీవించాలనుకోవడం కాదు, వాటిని అధిగమించే శక్తిని పెంచు

కోవడమే ముఖ్యమైనది.

కొంత మందికి ప్రమాదాలు జరుగుతాయి, కొంత మందికి కుటుంబ సమస్యలు ఉంటాయి, మరి కొందరికి ఆర్థిక ఇబ్బందులు ఉంటాయి. ఇక్కడ "పీతలు" అంటే ఇంట్లో ఉండే నిజమైన పీతలు కాదు, మిమ్మల్ని ఆధ్యాత్మికంగా ఎదగకుండా అడ్డుకునే సమస్యలు, అడ్డంకులు, పరిస్థితులు అని అర్థం. అవేవీ మిమ్మల్ని ప్రభావితం చేయకుండా ఉండే స్థితిని మీరు సాధించాలి.

మేము కూడా అనేక ప్రాంతాలలో తిరుగుతున్నాము, ఎన్నో పనులు చేస్తున్నాము. మాకు కూడా అందరికీ ఉన్నట్టే సమస్యలు ఉన్నాయి, కానీ వాటిని అధిగమించే శక్తిని సంపాదించుకున్నాము. అందుకే అవి మా ప్రయాణానికి అడ్డంకిగా మారడం లేదు.

పెద్దలు ఈ ఆధ్యాత్మిక మార్గాన్ని **"మంగలి కత్తిమీద నడక లాంటిది"** అని వర్ణించారు. అందుచేత ఆధ్యాత్మిక మార్గంలో నడవడం అంటే పీతల గంపలో ఉండి కూడా పైకి ఎదగడానికి ప్రయత్నించడం. సమస్యలు మిమ్మల్ని లాగినా, మీరు మరింత శక్తిని పెంచుకొని ముందుకు సాగాలి. అప్పుడే నిజమైన ఆధ్యాత్మిక పురోగతి సాధ్యమవుతుంది. పూర్ణాత్మ స్థాయిని చేరాలంటే అర్హత, శ్రద్ధ, పట్టుదల, నైపుణ్యం అవసరం.

చాలామంది "ఎందుకండీ ఇన్ని సమస్యలు, పరీక్షలు వస్తున్నాయి?" అని అడుగుతారు. కాని పూర్ణాత్మ స్థాయిని చేరడం అంత తేలికైన విషయం కాదు.

ఒక రాజ్యానికి రాజు కావాలంటే, ఆ వ్యక్తిలో ఎన్నో రకాల నైపుణ్యాలు ఉండాలి. ఏ ఒక్క నైపుణ్యం లోపించినా, మరొకరు అతనిపై ఆధిపత్యం సాధించి సింహాసనాన్ని స్వాధీనం చేసుకుంటారు. అందుకే రాజు అన్ని విషయాలలో ప్రావీణ్యం సంపాదించాలి. యుద్ధ విద్యలు నేర్చుకోవాలి, బుద్ధిని పెంచుకోవాలి, జ్ఞానాన్ని సంపాదించుకోవాలి, ప్రజలను నడిపించే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి.

ఎవరైనా ఏ ప్రశ్న అడిగినా సరైన సమాధానం చెప్పగలగాలి, ప్రజలను ఒప్పించగలగాలి, అందరినీ ముందుండి నడిపించగలగాలి, భయపడకుండా నిలబడగలగాలి, అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధపడాలి కానీ పిరికివాడిలా పారిపోకూడదు.

రాజు వెనక్కి తగ్గితే ప్రజలు ఎలా నిలబడగలరు? అందుకే సకల నైపుణ్యాలు సంపాదించుకున్న వ్యక్తికే రాజుగా లేదా చక్రవర్తిగా పాలించే అర్హత లభిస్తుంది.

ఏ లోపం ఉన్నా, ఆ స్థానంలోకి మరొకరు వచ్చేస్తారు. ఎవరి కోసం కూడా ఒక స్థానం శాశ్వతంగా ఖాళీగా ఉంచబడదు. ఒక వ్యక్తి ఉన్నత స్థానంలో ఉన్నప్పుడు, అతనిని పడగొట్టాలని చూసేవారు అతని రాజ్యంలోనూ ఉంటారు, అతని కుటుంబంలోనూ ఉంటారు, ఇతర రాజ్యాల వారూ ఉంటారు.

అటువంటి పరిస్థితుల్లో ఒక రాజు కేవలం సుఖాలను అనుభవిస్తూ, వినోదాలలో మునిగిపోయి కూర్చుంటే సరిపోదు. ఎప్పుడూ ఆనందం మీదే దృష్టి పెట్టినవాడు ఎక్కువకాలం ఆ స్థానంలో నిలవలేడు. రాజ్య పరిపాలనపై, తన బాధ్యతలపై దృష్టి పెట్టకుండా ఇతర విషయాలపై మక్కువ చూపితే, తన స్థానం కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

అందువల్ల ఒక రాజుకు తన రాజ్యాన్ని కాపాడుకునే శక్తి, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం, సరైన నిర్ణయాలు తీసుకునే వివేకం ఉండాలి. ఏ పరిస్థితి వచ్చినా ఎదుర్కోగల సమస్త శక్తి సామర్థ్యాలను పెంచుకున్నప్పుడే అతను తన స్థానాన్ని నిలబెట్టుకోగలుగుతాడు.

అలాగే ఆధ్యాత్మిక మార్గంలో నడిచే సాధకుడు కూడా కేవలం సుఖాల కోసం కాకుండా, తన లక్ష్యంపై దృష్టి నిలిపి, ఎదురయ్యే ప్రతి అడ్డంకిని అధిగమించే శక్తిని పెంచుకోవాలి. అప్పుడే అతను ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితికి చేరుకోగలుగుతాడు.

భూమిపై రాజు కావడం కంటే, సృష్టిలో పూర్ణాత్మ కావడం మరింత

కష్టమైన విషయం, ఇది  గుర్తుంచుకోవాలి. పూర్ణాత్మ అంటే ఎవరో వచ్చి నేర్పించేవాడు కాదు, తానే ఇతరులను తయారు చేయగల స్థాయికి ఎదిగినవాడు. తానే పది మందిని నడిపించగలిగినవాడు, కష్టాలు వచ్చినప్పుడు పారిపోకుండా నిలబడగలిగినవాడు.

అమ్మో! రాజు కావడం అంత తేలిక కాదు అని భయపడితే, అలాగే పూర్ణాత్మ కావడం అంత తేలికా అని ప్రయత్నించకుండా "ఈ జన్మలో హాయిగా సంసారం చేసుకుందాం, సుఖాలు అనుభవిద్దాం, తరువాతి జన్మలో చూద్దాం" అని భావిస్తే, అలాంటి వ్యక్తిని ఆధ్యాత్మికంగా ముందుకు సాగలేడు.

అందుకే షిరిడీ సాయిబాబా ఆత్మ సాక్షాత్కారానికి ముముక్షత అంటే మోక్షం పొందాలనే కోరిక, తపన, ఆసక్తి, పట్టుదల అవసరమని చెప్పారు. మోక్షం పొందాలనే బలమైన కోరిక ఉన్నవాడే ఆత్మ సాక్షాత్కారానికి అర్హుడు అన్నారు.

అందుచేత ఆధ్యాత్మిక మార్గంలో నడవడం అంత తేలికైన విషయం కాదు. చాలామంది, "మనకు ఈ కష్టాలెందుకు? హాయిగా సంసారం చేసుకుంటూ, జీవితాన్ని ఆనందంగా గడిపేద్దాం. ఏమో, ఇంతకుముందు జన్మల్లో సరిగా అనుభవించామో లేదో, ఇప్పుడు అయినా తిని, తిరిగి, భార్యతో గానీ భర్తతో గానీ సుఖాలు అనుభవిద్దాం, పిల్లలతో సరదాగా కాలం గడిపేద్దాం. ఆధ్యాత్మిక విషయాలు వచ్చే జన్మలో చూసుకుందాం" అని అనుకున్నవారు నిజమైన ఆధ్యాత్మిక ఎదుగుదలను సాధించలేరు.

కానీ మీరు అలాంటి వారు కాదనే నా నమ్మకం. అందుకే మీరు ఈ జ్ఞాన మార్గంలో అడుగుపెట్టారు. ఆధ్యాత్మికంగా ఎదగాలనే కోరిక ఉన్నవారి కోసమే ఈ భీమవరం క్లాసులు, ప్రతిరోజూ జరిగే మార్నింగ్ జూమ్ తరగతులు నిర్వహించబడుతున్నాయి.

పత్రి గారు ఒక మంచి ఉదాహరణ చెప్పారు. "మన సొసైటీ ఒక సూపర్ బజార్ లాంటిది" అని. సూపర్ బజార్‌లో అన్ని రకాల వస్తువులు

ఉంటాయి, ఎవరికి ఏది కావాలో అది కొనుక్కుంటారు. అందరూ ఒకే రకం కొనరు. అలాగే మన సొసైటీలో కూడా ఎన్నో రకాల కార్యక్రమాలు, సాధనలు, అవకాశాలు ఉంటాయి, ఎవరి ఆసక్తిని బట్టి వారు దానిని అనుసరిస్తారు.

సూపర్ బజార్‌లో అన్నింటికంటే విలువైనది వజ్రాల విభాగం (డైమండ్ స్టాల్) అయినట్లే, మన సొసైటీలో అన్నింటికంటే విలువైనది జ్ఞానాన్ని బోధించి, కర్మలు తొలగించి, మోక్ష మార్గాన్ని చూపించే జ్ఞాన విభాగం. ఎందుకంటే అది మనిషి జీవితాన్ని పూర్తిగా మార్చగలదు.

సూపర్ బజార్‌లో ఎవరికి ఏది నచ్చితే వారు అక్కడికి వెళ్తారు. అలాగే జీవితంలో కూడా ఎవరికి ఏ విషయంపై ఆసక్తి ఉంటే వారు దాని వైపు వెళ్తారు. కొంత మందికి వినోదాలు ఇష్టం ఉంటాయి, వారు ఆ దిశగా వెళ్తారు, కొంత మందికి నృత్యం ఇష్టం ఉంటే నృత్యం నేర్పే గురువుల వద్దకు వెళ్తారు, మరి కొందరికి సంగీతం ఇష్టం ఉంటే సంగీత గురువుల వైపు వెళ్తారు.

కానీ మీకు జ్ఞానం మీద ఆసక్తి కలిగింది, ఆత్మజ్ఞానం తెలుసుకోవాలనే తపన కలిగింది. అందుకే మీరు ఈ జ్ఞాన మార్గంలోకి వచ్చారంటే యాదృచ్ఛికంగా జరిగినది కాదు; మీ అంతరంగంలో ఉన్న ఆధ్యాత్మిక తపనే మిమ్మల్ని ఇక్కడికి తీసుకొచ్చింది. జ్ఞానం పట్ల ఆసక్తి కలిగినవారే మన దగ్గర నిలబడగలరు, ముందుకు సాగగలరు, చివరికి తమ జీవిత లక్ష్యాన్ని చేరుకోగలరు.

“ఎందుకు ఈ గొడవ? ఎందుకు ఈ సాధన?” అని భావించి, కేవలం భోగాలు, సుఖాలు, సంసారమే జీవిత లక్ష్యం అనుకునే వారు ఆధ్యాత్మికంగా ఎదగలేరు. కానీ మీరు అలాంటి వారు కాదనే నా ఉద్దేశం. అందుకే ఈ జ్ఞానం మీకు బోధించబడుతోంది.

భీమవరం క్లాసులు, మార్నింగ్ జూమ్ క్లాసులు, జ్ఞాన బోధనలు అన్నీ కూడా ఆత్మజ్ఞానం పట్ల ఆసక్తి ఉన్నవారి కోసమే నిర్వహించ బడుతున్నాయి.

జ్ఞానం మీద ఆసక్తి లేకపోతే ఈ మార్గంలోకి ఎవరూ రాలేరు.

పత్రి గారు "మన సొసైటీ ఒక సూపర్ బజార్ లాంటిది" అన్నారు. సూపర్ బజార్‌లో అన్ని రకాల వస్తువులు దొరికినట్లే, మన సొసైటీలో కూడా అన్ని రకాల కార్యక్రమాలు ఉంటాయి అన్నారు.

ఎవరికి ఆరోగ్యం మీద ఆసక్తి ఉంటే వారు ఆరోగ్య కార్యక్రమాలకు వెళ్తారు, ఎవరికి కోరికలు ఉంటే సంకల్పాలు పెట్టించే మాస్టర్స్ దగ్గరకి వెళ్తారు. వినోదం ఇష్టమైతే వారు ఆ రకమైన గురువుని  అనుసరిస్తారు.

కానీ ఎవరికి జ్ఞానం కావాలో, మోక్షం కావాలో, కర్మలను అధిగమించాలనే తపన ఉంటుందో వారు జ్ఞాన బోధకోసం మన దగ్గరకు వస్తారు.  సూపర్ బజార్‌లో అత్యంత విలువైన విభాగం వజ్రాల విభాగం అయినట్లే, ఆధ్యాత్మిక సొసైటీలో అత్యంత విలువైనది జ్ఞాన బోధ. ఎందుకంటే జ్ఞానం మాత్రమే కర్మలను దగ్ధం చేసి మోక్షానికి దారి చూపగలదు.

మీ అందరికీ జ్ఞానం నచ్చింది. అందుకే మీరు ఇక్కడికి వచ్చారు. జ్ఞానం పట్ల ఆసక్తి లేకపోతే ఇక్కడికి వచ్చేవారు కాదు. మీరు 350 జన్మలు దాటారు కాబట్టే  భీమవరానికి ఆకర్షితులు అయ్యారు.

ఒకవేళ ఇదే జూమ్ లో ఇతరులను కూర్చోబెట్టినా, ఈ విషయాలు వారికి అర్థం కావు. చాలామంది, "మేము మూడు నాలుగు సంవత్సరాల క్రితమే మీ దగ్గరకు వచ్చాము,  కానీ అప్పుడు అర్థం కాలేదు. ఇప్పుడు మాత్రం అర్థమవుతున్నాయి" అని చెబుతుంటారు.

సత్యం చాలా కఠినమైనది, కొన్నిసార్లు చేదుగా కూడా అనిపిస్తుంది. సత్యాన్ని స్వీకరించే స్థితిలో లేని వారికి సత్యం చెప్పినా అది హృదయానికి చేరదు. కానీ సత్యాన్వేషణలో ఉన్నవారికి అదే సత్యం జీవితాన్ని మార్చే శక్తిగా మారుతుంది.

ఒకసారి పీఎంసీ ఆనంద్ పత్రిగారిని అడిగాడు: "మనం శ్వాస మీద ధ్యానం గురించే ఎక్కువగా బోధించాలి కదా? మరి ఎందుకు ఎన్నో

రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం? అని అన్నప్పుడు పత్రి గారు చాలా స్పష్టంగా సమాధానం చెప్పారు.

అందుచేత ఒక విషయం గుర్తుపెట్టుకోండి. పి.ఎం.సి.లో కార్యక్రమాలు ఆ స్థాయిలో ఉన్న సాధకుల అవసరాల కోసం నిర్వహించ బడతాయి. కొంత మందికి ఆరోగ్యం మీద ఆసక్తి ఉంటుంది కాబట్టి రోగ నివారణ గురించి చెబుతారు. కొంత మందికి సంకల్పాల మీద ఆసక్తి ఉంటుంది కాబట్టి వాటి గురించి బోధిస్తారు. మరి కొందరికి వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలు ఇష్టం ఉంటాయి కాబట్టి డాన్స్‌లు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అలాగే జ్ఞానాన్ని బోధించే కార్యక్రమాలు కూడా ఉన్నాయి, నా సందేశాలు ఉంటాయి, మేడం సందేశాలు ఉంటాయి, పత్రి గారి సందేశాలు ఉంటాయి. ఎవరికీ ఏది నచ్చితే వారు దానిని స్వీకరిస్తారు, ఒకరు వినోద కార్యక్రమాల వైపు వెళ్తారు, మరొకరు జ్ఞాన కార్యక్రమాల వైపు వస్తారు. అయితే వినోదం, సంకల్పాలు, ఇతర కార్యక్రమాల వద్ద ఉన్నవారు కూడా క్రమంగా ఎదుగుతూ ఒకరోజు జ్ఞాన మార్గం వైపు వస్తారు, కానీ జ్ఞాన మార్గంలోకి వచ్చినవారు వెనక్కి వెళ్ళరు.

అన్ని స్థాయిల వారికీ మాస్టర్లు ఉంటారు. ఒక విశ్వవిద్యాలయంలో నర్సరీ నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు అన్ని తరగతులు ఉన్నట్లే, ప్రతి తరగతికి తగిన బోధకులు ఉన్నట్లే, ఆధ్యాత్మిక మార్గంలో కూడా ప్రతి స్థాయికి తగిన గురువులు ఉంటారు. నర్సరీ విద్యార్థులకు బోధించే గురువులు ఉంటారు, మొదటి తరగతి వారికి ఉంటారు, ఐదవ తరగతి వారికి ఉంటారు, పదవ తరగతి వారికి ఉంటారు, ఇంటర్మీడియట్ వారికి ఉంటారు, డిగ్రీ వారికి ఉంటారు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయికి కూడా ప్రత్యేక మాస్టర్లు ఉంటారు.

గమనిస్తే అన్ని తరగతులలో విద్యార్థులు ఉంటారు, ఏ తరగతి ఖాళీగా ఉండదు. అయితే ఒక తేడా ఉంటుంది, నర్సరీ, ప్రాథమిక స్థాయిలలో

ఉన్నవారు లక్షల సంఖ్యలో ఉంటారు. ఉన్నత స్థాయికి వచ్చినవారు వేల సంఖ్యలో ఉంటారు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయికి వచ్చినవారు వందల సంఖ్యలో ఉంటారు, యూనివర్సిటీ స్థాయికి చేరుకున్నవారు పదుల సంఖ్యలో మాత్రమే ఉంటారు.

అదే విధంగా మీరు జ్ఞాన మార్గం వైపు ఆకర్షితులయ్యారంటే, మీరు ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి చేరుకున్నారని అర్థం. అందుకే ఈ జ్ఞానం మీకు నచ్చింది, చాలామందికి ఎంత చెప్పినా ఈ విషయాలు అర్థం కావు, ఆసక్తి కలగదు. ఎందుకంటే వారు ఇంకా ఆ స్థాయికి చేరుకోలేదు. ఆ స్థాయికి రావడానికి వారికి ఇంకా 50 జన్మలు పడుతుంది, 50 జన్మలు అంటే కొన్ని లక్షల సంవత్సరాలు.

అందువల్ల మీ ఆధ్యాత్మిక స్థాయిని గుర్తించండి. మీ దేహాన్ని చూసి మిమ్మల్ని మీరు అంచనా వేయకండి. మీ ఆర్థిక పరిస్థితిని చూసి మీ విలువను నిర్ణయించకండి. మీ కుటుంబ పరిస్థితులను చూసి నిరుత్సాహపడకండి, మీరు ఈ జ్ఞానాన్ని అర్థం చేసుకునే స్థాయికి వచ్చారంటే, మీవి సామాన్యమైన ఆత్మలు కాదు.

చిన్న చిన్న సమస్యలను పెద్దవిగా భావించి బాధపడకండి, మీ స్థాయిని మీరు గుర్తించండి. మీకంటే అదృష్టవంతులు చాలా తక్కువమంది ఉంటారు. ఎందుకంటే మీరు చేరుకున్న ఈ ఆధ్యాత్మిక స్థాయికి చేరుకోవడానికి ఇంకా అనేక జన్మల పడుతుంది.

# పత్రిగారితో పొందిన అనుభవాలు

మరణించక ముందు చాలా విషయాలు తెలియవు కాని మరణించిన తర్వాతే అవి తెలుస్తాయి. మరణించక ముందు అన్నీ నిజమే అనిపిస్తాయి, "నా వారు, మా వారు, నా ధనం, నా సంపదలు, నా పదవులు, నా అధికారం" అని భావిస్తారు. కానీ మరణించిన వెంటనే అర్థమవుతుంది. "అరే! నేను అనుకున్నవన్నీ, సంపాదించుకున్నవన్నీ, నావి అనుకున్నవన్నీ ఏవీ నాతో రావు, నావి కావు" అనే విషయం స్పష్టంగా అర్థమవుతుంది.

నేను ఒక్కటే చెబుతున్నాను. ఎవరైతే మరణానంతర జీవితం గురించి లోతైన అవగాహన కలిగి ఉంటారో వారి జీవితం పూర్తిగా మారిపోతుంది. ప్రస్తుతం మీరు జీవిస్తున్న జీవితానికి, మరణానంతరం జరిగే విషయాలను తెలుసుకున్న తర్వాత మీరు జీవించే జీవితానికి పూర్తి భిన్నంగా ఉంటుంది. నా జీవితంలో కూడా అదే జరిగింది.

పత్రి గారి పరిచయం కాక ముందు నాకు మరణానంతర జీవితం గురించి ఏమీ తెలియదు, పత్రి గారి పరిచయం అయిన తర్వాతే నాకు ఆ విషయాలు అర్థమయ్యాయి. ముఖ్యంగా ఆయన మాటల ద్వారానే నాకు స్పష్టమైన అవగాహన వచ్చింది.

ఒక సందర్భంలో పత్రి గారు ఇలా చెప్పారు, "నేను ఎవరికీ సులభంగా అర్థం కాను" ఎందుకంటే ఈ లోకంలో అందరూ నమ్ముతున్న దానికి పూర్తి విరుద్ధంగా నేను చెబుతూ ఉంటాను అందువల్ల నేను చెప్పే విషయాలన్నీ తప్పు అని చాలామంది భావిస్తారు, తప్పుగా అర్థం చేసుకుంటారు. మనల్ని నిజంగా అర్థం చేసుకోవడం అంత తేలికైన విషయం కాదని ఆయన చెప్పారు.

ఎందుకంటే అందరూ దేహమే నేను అని భావిస్తూ, దేహానికే ప్రాముఖ్యం ఇస్తూ, దేహ సుఖాల కోసమే జీవిస్తూ ఉంటే, పత్రిగారు మాత్రం "మీరు దేహం కాదు" అని చెబుతారు, అప్పుడు ఆశ్చర్యం కలగడం సహజం.

అందరూ నేను దేహం అని అనుకుంటే, ఆయన మాత్రం "మీరు ఆత్మ" అని అంటారు.

అక్కడి నుంచే గందరగోళం మొదలవుతుంది. ఎందుకంటే అంతకుముందు ఆత్మ గురించి ఎవరికీ స్పష్టమైన అవగాహన లేదు. ఆత్మ ఎక్కడ ఉందో! ఎలా ఉంటుందో! దాని ప్రాముఖ్యత ఏమిటో తెలియదు. "మీరు ఆత్మ" అనే సత్యాన్ని పూర్తిగా అర్థం చేసుకునే లోపే ఈ జన్మ కూడా అయిపోతుంది.

మొదట్లో ఆయన చెప్పిన విషయాలు నా మనసులో ఎంతో గందరగోళాన్ని సృష్టించాయి. అయితే ఆయన చెప్పింది తప్పు అని నేను అనుకోలేదు. నాకు అర్థం కాలేదు, అందుకే నేను ఎంతో అధ్యయనం చేశాను. అనేక మందిని సంప్రదించాను, ఎన్నో గ్రంథాలు చదివాను, చివరకు ఆయన చెప్పింది పూర్తిగా సత్యమే అని తెలుసుకున్నాను. ఏ క్షణంలో ఆ సత్యం నాకు అర్థమైందో, ఆ క్షణం నుంచే నా జీవితం పూర్తిగా మారిపోయింది.

ఆ తర్వాత నా మనసులో ఎన్నో ప్రశ్నలు వచ్చాయి. "నేను దేహం కాకపోతే, నేను ఆత్మనైతే, ఇప్పుడు నేను సంపాదించిన కోట్ల రూపాయల ఆస్తులు, సంపదలు నిజంగా నాకు అంటే ఆత్మకు ఏమైనా ఉపయోగ పడతాయా?" అనే ప్రశ్న ఉదయించింది. చూస్తే మీకు ఉపయోగపడవు. పూచిక పుల్లకు ఎంత విలువ ఉంటుందో, ఇవన్నీ కూడా అంతే. చివరికి అవన్నీ భూమి మీదే ఉండిపోతాయి. ఈ సత్యాన్ని నేను 24 సంవత్సరాల క్రితమే అర్థం చేసుకున్నాను, అందుకే నా జీవితంలో ఎంతో గొప్ప మార్పు వచ్చింది.

అప్పుడు వెంటనే ధన సంపాదన ఆపేశాను, నా వ్యాపారాలన్నింటినీ మూసి వేశాను. చివరికి ధనం కాదు, లాభం కలిగించేది జ్ఞానమే అని తెలుసుకున్నాను. ఆ జ్ఞానం ఎలా సంపాదించాలో కూడా తెలుసుకుని, పూర్తిగా జ్ఞాన సంపాదన మీదే దృష్టి పెట్టాను.

ఇప్పుడు చెప్పండి, నాలో ఎంత మార్పు వచ్చిందో! అలాగే పత్రి

గారు చెప్పిన విషయాలు నిజంగా మీకు అర్థమైతే, మీలో కూడా విపరీతమైన మార్పులు వస్తాయి. మార్పులు రాలేదంటే ఇంకా ఆ విషయాలు పూర్తిగా అర్థం కాలేదని అర్థం. ఒక విషయం బాగా గుర్తుంచుకోండి, తెలుసుకోవడం వేరు, అర్థం చేసుకోవడం వేరు.

తెలుసుకున్న వ్యక్తి ఇతరులకు చెబుతాడు, కానీ అర్థం చేసుకున్న వ్యక్తి ఆచరిస్తాడు. కేవలం ఇతరులకు చెప్పేవాడు గొప్పవాడు కాదు. చాలామంది, "మేము క్లాసులు చెబుతున్నాం" అని అంటుంటారు. క్లాసులు చెప్పడం వల్ల మాత్రమే ఎవరూ గొప్ప వారు కాలేరు. తెలుసుకున్న విషయాన్ని జీవితంలో ఆచరించినప్పుడే నిజంగా గొప్ప వారు అవుతారు, కేవలం చెప్పడం వల్ల జ్ఞానం రాదు, ఆచరించడం వల్లే జ్ఞానం వస్తుంది. అందుకే వినడం, చదవడం, తెలుసుకోవడం మాత్రమే కాకుండా, వాటిని జీవితంలో అమలు చేయడం ఎంతో ముఖ్యమైనది అని తెలుసుకోవాలి.

ఆ తర్వాత ఆయన మరో ఆశ్చర్యకరమైన విషయం చెప్పారు. "విగ్రహం దేవుడు కాదు" అన్నారు. ఆ మాట విన్నప్పుడు నా మనసు పూర్తిగా కుదేలైంది. ఎందుకంటే నేను శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుడిని, ఆయన నా ఇష్టదైవం.

ఆయన కోసం ఒక మందిరమే నిర్మించాను. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అక్కడే ఉండి ఎంతో భక్తితో ఆరాధించేవాడిని. అలాంటి నేను ఆరాధించే విగ్రహమే దేవుడు కాదని ఆయన చెప్పినప్పుడు, దాన్ని జీర్ణించుకోవడం చాలా కష్టమైంది.

భారతదేశంలో కోట్లాది మంది ప్రజలకు విగ్రహమే దైవం అనే నమ్మకం ఉంది. అలాంటప్పుడు పత్రిగారు మాత్రం "విగ్రహం దేవుడు కాదు" అని చెప్పారు. అది అర్థం చేసుకోవడానికి నాకు చాలా సమయం పట్టింది. 2002 నవంబర్‌లో ఆయనతో నాకు పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత 2003 జనవరిలో పిరమిడ్ నిర్మించి, ఆయన చేత ప్రారంభోత్సవం చేయించాను. ఆ సమయంలో ఆయన, "మూడు రోజుల యజ్ఞం నిర్వహించాలి"

అని చెప్పారు. నాకు యజ్ఞం గురించి కూడా తెలియదు, మూడు రోజులు ఎందుకు చేయాలో కూడా అర్థం కాలేదు, అయితే ఆయన మీద నాకు ఉన్న నమ్మకం వల్ల, చేస్తానని చెప్పాను. ఎలా చేయాలో  చెప్పండి" అన్నాను.

ఆయన సూచనల ప్రకారం కొంతమంది మాస్టర్లు వచ్చారు. 2003 ఫిబ్రవరిలో తేదీలు నిర్ణయించారు, వెస్ట్ గోదావరి జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ప్రచారం చేయించడానికి వారందరికి కారు, బైకులు ఏర్పాటు చేశాను. ఎవరికి ఎలా సౌకర్యంగా ఉంటే అలా పంపించాను. దాదాపు ఒక నెల రోజుల పాటు వారందరినీ మా ఇంట్లోనే ఉంచుకుని, వారికి కావలసిన అన్ని సౌకర్యాలు కల్పించి వారిని ప్రచారం కోసం పంపించాను.

అయితే వారు నిజంగా అన్ని ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారా? లేదా? అన్న సందేహంతో ప్రతి ఒక్కరికీ కెమెరాలు ఇచ్చి, వెళ్ళిన ప్రతి గ్రామంలో ఫోటోలు తీయమని చెప్పాను. ఆ ఫొటోలతో యజ్ఞంలో ఒక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి, ఎన్ని ప్రాంతాల్లో ప్రచారం చేశామో అందరికీ చూపించాలని అనుకున్నాను.

యజ్ఞం మొదటి రోజు శనివారం పత్రిగారు అందరినీ కూర్చోబెట్టి ధ్యానం చేయిస్తున్నారు. కాని మేమిద్దరం  వెంకటేశ్వరస్వామి మందిరంలో పూజ చేయించుకుని, గదిలోకి వచ్చాం.

అప్పుడు పత్రిగారు స్టేజ్ మీద నుంచి దిగి మా దగ్గరకు వచ్చి, ఎక్కడికి వెళ్లారు? అని అడిగారు. ఏమి చెప్పాలో మాకు అర్థం కాలేదు, ఎందుకంటే ఆయన ఒకవైపు యజ్ఞాన్ని నిర్వహిస్తుండగా, మేము పూజ చేయించుకున్నాం. అప్పుడు "పూజ చేయడం వల్లే కదండీ మీలాంటి మహానుభావులు మాకు పరిచయం అయ్యారు" అన్నాను.

అప్పుడు ఆయన అందుకే "నా పరిచయం నీకు ఇంత ఆలస్యం అయింది" అన్నారు.

నేను పూజలు లాభం కలిగిస్తాయని చెప్పాను, కానీ ఆయన చెప్పిన భావం వేరు. "అది నీకు లాభం కాదు నాయనా, ఎంతో నష్టం కలిగించింది" అనే అర్థంతో ఆయన మాట్లాడారు. ఆ సమయంలో నాకు అది అర్థం కాలేదు.

ఇంతలో ధ్యానం రెండు, మూడు గంటలు దాటిపోయింది. ఓ.కె. చెప్పే వారు లేరు, ఆయన చెప్పరు, ఎలా? పైగా అందరికి కొత్త, కూర్చో లేక ఇబ్బంది పడుతున్నారు. చివరకు నేను వెళ్ళి ఓ.కె.. చెప్పాను.

కాని "నా పరిచయం నీకు ఇంత ఆలస్యం అయింది" అన్న మాట ఒకటి, రెండు సంవత్సరాల తర్వాత అర్థమైంది. అప్పటికి కొంత జ్ఞానం సంపాదించాను, జ్ఞానం ఆత్మకు ఎంత లాభం కలిగిస్తుందో తెలుసుకున్నాను, ఆ జ్ఞానం పెరిగే కొద్దీ కలిగే ప్రయోజనాలు అర్థమయ్యాయి, అప్పుడు అనిపించింది.

"అరే! నా జీవితం ఎంత వృథా అయిపోయింది, పత్రి గారు నాకు పదేళ్ళ ముందే పరిచయం అయి ఉంటే, నేను ఇంకా ఎంత ఎదిగేవాడిని! ఎంత గొప్ప అవకాశాన్ని కోల్పోయాను అని అనుకున్నాను. ఆ తర్వాత ఒకరోజు నేను పత్రి గారినే అడిగాను.

"ఏవండీ! మీరు నాకు పదేళ్ళముందే పరిచయం అయి ఉంటే ఎంత బాగుండేది!" అన్నాను.

ఆయన నవ్వుతూ, "సరే అయిపోయిందేదో అయిపోయింది, ఇప్పుడైనా జాగ్రత్త పడు" అన్నారు.

నేను నా జీవితంలో విలువైన సమయం ఎంత కోల్పోయానో తెలిసింది. నేను పూజల వల్ల లాభం జరిగిందని అనుకున్నాను. కానీ ఆయన "ఇంత ఆలస్యమైంది" అంటే పూజవల్ల ఎంత నష్టపోయానో అర్థమైంది.

నేను దాదాపు యాభై సంవత్సరాలు ఎంతో నిష్ఠగా పూజలు చేశాను. మా ఇంట్లో ప్రతి శనివారం శాస్త్రోక్తంగా పూజలు చేసేవాడిని, మా ఆవిడకు పూజలపై అంత ఆసక్తి లేకపోయినా, నేను మాత్రం ఎంతో భక్తితో నిర్వహించే వాడిని. పూజారి మంత్రాల్లో ఒక్క అక్షరం తప్పు చెప్పినా నేను వెంటనే సరి చేసే వాడిని. ఎందుకంటే శాస్త్ర ప్రకారం చేస్తేనే ఫలితం వస్తుందని నమ్మకం. అంత నిష్ఠగా యాభై సంవత్సరాలు పూజలు చేసినా నాకు జ్ఞానం రాలేదు, దుఃఖం పోలేదు, పుస్తకాలు రాయలేకపోయాను, సందేశాలు ఇవ్వలేకపోయాను,

నా జీవితంలో ఎలాంటి  మార్పు రాలేదు.

ప్రతి సంవత్సరం తిరుపతి వెళ్లేవాడిని. దాదాపు యాభై మూడు సంవత్సరాలు ఒక్కసారి కూడా మానలేదు. అయినా నాలో మార్పు ఏమీ రాలేదు, నేను ఎంతో గొప్ప పని చేస్తున్నానని మాత్రమే భావించేవాడిని.

పత్రి గారి పరిచయం అయిన తర్వాత ఒకసారి ఆయనను కలవడానికి తిరుపతి వెళ్ళాను. సమావేశం పూర్తయ్యాక అదే రోజు భీమవరం తిరిగి వెళ్ళాలి, కాని ఆ రోజు తిరుమల వెళ్ళి దర్శనం కూడా చేసుకోలేదు. అప్పుడు నేను పత్రి గారితో "ఏవండీ!  తిరుపతి వచ్చినప్పుడు తిరుమల వెళ్ళి, దర్శనం చేసుకోకుండా తిరిగి వెళ్ళడం ఇదే మొదటిసారి.." అన్నాను.

ఆ రోజు ఆయన ఇచ్చిన సమాధానం, "నీ బుద్ధి బాగా పని చేసిందయ్యా" అన్నారు. ఆ మాట కూడా అప్పట్లో అర్థం కాలేదు, కానీ తర్వాత అర్థమైంది.

బుద్ధి వికసించినవాడు లాభం కలిగించే పనులనే చేస్తాడు, నష్టం కలిగించే పనులను చేయడు. అలాంటి వాడే నిజమైన అదృష్టవంతుడు. బుద్ధి సంపూర్ణంగా వికసించినవారినే "బుద్ధుడు" అని పిలుస్తారు.

అందుకే నేను ప్రతి ఒక్కరికీ ఎప్పుడూ ఒకటే చెబుతుంటాను. "ముందు మీ బుద్ధిని పెంచుకోండి, బుద్ధి పెరగకుండా ఏ విషయం పూర్తిగా అర్థం కాదు. బుద్ధి వికసించకపోతే మీ ప్రవర్తనలో కూడా మార్పు రాదు."

బుద్ధి గురించి నేను ఇప్పటికే ఎన్నో సందర్భాల్లో వివరించాను. పత్రి గారు చెప్పిన ఒక్క మాటలోనే ఎంత అపారమైన జ్ఞానం దాగి ఉందో తర్వాత అర్థమైంది. యాభై సంవత్సరాలకు పైగా మూఢనమ్మకాల మధ్య జీవించిన నాకు, జ్ఞానం పెరిగిన తర్వాతే అసలు మార్పు వచ్చింది.

"ఆత్మే దేవుడు, ఆత్మే సత్యం, ఆత్మనే ఆశ్రయించాలి, ఆత్మను ఆశ్రయించే మార్గమే ధ్యానం."

ఇలాంటి సత్యాలను ఇంకెవరు చెప్పారు? చాలామంది ప్రజలను ఆకర్షించే విషయాలనే చెబుతారు. కానీ సత్యాన్ని చెప్పడం అంత తేలిక కాదు,

జ్ఞానాన్ని బోధించడం సాధారణ విషయం కాదు.

పత్రి గారు ఇంకా ఎన్నో విరుద్ధంగా అనిపించే సత్యాలను చెప్పారు. "మందుల మీద ఆధారపడకండి, మీ ఆత్మ శక్తిపై ఆధారపడండి." "విగ్రహం దేవుడు కాదు. ఆత్మే దేవుడు." "మాంసాహారం వద్దు, శాకాహారమే శ్రేయస్కరం." "మిమ్మల్ని రక్షించేది దేవుడు కాదు, మీ ధర్మమే మిమ్మల్ని రక్షిస్తుంది."

ఇవి అన్నీ ప్రపంచం నమ్ముతున్న భావాలకు పూర్తిగా భిన్నమైనవే. చాలామంది తమ జీవితంలో ఎదురయ్యే కష్టాలకు ఇతరులనే కారణంగా భావిస్తారు, లేకపోతే దేవుడే పరీక్షిస్తున్నాడని అనుకుంటారు. కానీ పత్రి గారు మాత్రం ఇలా చెప్పారు.

**"మీ వాస్తవానికి మీరే సృష్టికర్తలు, మీ జీవితానికి మీరే కారణం, మరెవ్వరూ కాదు."**

ఆయన ఇలా కూడా చెప్పారు.


**"మిమ్మల్ని రక్షించడానికి బయట నుంచి ఎవరూ రారు. ప్రతి ఒక్కరూ తమను తాము రక్షించుకోవాలి, తమను తాము ఉద్ధరించుకోవాలి."**

ఇలాంటి అమూల్యమైన సత్యాలను ఆయన మనకు అందించారు, అందుకే పత్రి గారు చెప్పిన మాటలను కేవలం విని వదిలేయకండి. మళ్ళీ మళ్ళీ వినండి, మననం చేయండి, అర్థం చేసుకోండి, జీవితంలో ఆచరించండి. అలా ఆచరించినవారే నిజంగా గొప్పవారిగా ఎదుగుతారు. కేవలం రాత్రింబవళ్ళు ధ్యానం చేస్తున్నా మీరు గొప్ప వారు కాలేరు. పదేళ్ళ క్రితం ఎలా ఉన్నారో, ఇప్పటికీ అలాగే ఉంటే ఆ ధ్యానం వల్ల ప్రయోజనం ఏమిటి? ఒక్క విషయం మాత్రం ఎప్పటికీ గుర్తుంచుకోండి.

జ్ఞానం ఉన్నవాడే నిజమైన గొప్పవాడు. పత్రి గారు చెప్పిన ప్రతి విషయం ప్రపంచ దృష్టిలో విరుద్ధంగా అనిపించినా, అవన్నీ పరమ సత్యాలే.

# తేటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించక ముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం - రూ.120/-
10) "గ్రైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) గీతాసందేశం - రూ.120/-
12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణంతర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు - రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు - రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు -రూ.90/-
23) ముఖ్యమైన సందేశాలు-1 -రూ.80/-
24) ముఖ్యమైన సందేశాలు-2 -రూ.90/-
25) కర్మ సిద్ధాంతం - రూ.80/-
26) ధ్యానమంటే ? - రూ.80/-
27) త్రివిధాలు - రూ.80/-
28) ఉత్తమ పురుషుడు - రూ.80/-
29) వశిష్ఠుల వారి సందేశాలు - రూ.70/-
30) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
31) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
32) జ్ఞాన జ్యోతి - రూ.70/-
33) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
34) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
35) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
36) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.70/-
37) బుద్ధుని సందేశాలు - రూ.70/-
38) భూతదయే దైవత్వం - రూ.70/-
39) ఆత్మహంతకులంటే ఎవరు? - రూ.70/-
40) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
41) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
42) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
43) మానవునిలోని చెడు -రూ.70/-
44) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
45) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
46) మోక్షం అంటే? - రూ.70/-
47) కబీరు సందేశాలు-1 -రూ.70/-
48) మనసు-1 - రూ.70/-
49) మనసు-2 - రూ.70/-
50) మరణానంతరం జరిగేది-1 - రూ.60/-
51) మరణానంతరం జరిగేది-2 - రూ.70/-
52) మరణానంతరం జరిగేది-3 - రూ.60/-
53) కబీరు సందేశాలు-2 - రూ.60/-
54) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
55) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
56) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
57) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
58) అతీంద్రియ శక్తులు - రూ.60/-
59) ఆలోచించండి - రూ.60/-
60) నిర్వాణ మార్గం - రూ.60/-
61) ధ్యానులకు సూచనలు - రూ.60/-
62) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
63) మమకారం - రూ.60/-
64) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
65) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
66) మాస్టర్‌గా ఎదగాలంటే? - రూ.50/-
67) భగవంతుని ఇష్టులవ్వాలంటే - రూ.50/-
68) సంకల్పమంటే? - రూ.50/-
69) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
70) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
71) మూడురకాల భవిష్యత్తులు - రూ.50/-
72) అరిహంత్ - రూ.50/-
73) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన - రూ.50/-
74) భార్యభర్తలు గొడవ పడకూడదంటే - రూ.40/-
75) విదురుని సందేశాలు - రూ.40/-
76) మూడురకాల జీవితాలు - రూ.40/-
77) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే - రూ.40/-
78) ఛాంపియన్ అవ్వాలంటే? - రూ.40/-
79) బ్రహ్మం అంటే? - రూ.40/-
80) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం - రూ.40/-
81) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం - రూ.40/-
82) మహాత్ముల సందేశాలు - రూ.40/-
83) సత్యం - రూ.40/-
84) చక్రాలు - రూ.40/-
85) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
86) భాగవత సన్నివేశాల అంతరార్థం - రూ.40/-
87) మౌన ధ్యానం - రూ.40/-
88) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
89) శాకాహారమే మానవాహారం - రూ.15/-
90) అహింస మరియు శాఖాహారం - రూ.15/-



- నువ్వు జీవితంలో చేసిన కర్మలను బట్టి ఇప్పుడు నువ్వు తీసుకు వెళ్ళబడే లోకం ఆధారపడి ఉంటుంది.
- నువ్వు పాపాలు చేస్తే భువర్లోకానికి వెళ్తావు, పుణ్యాలు చేస్తే సువర్లోకానికి తీసుకువెళ్లబడతావు.
- మీ జీవిత ప్రణాళిక ఏమిటో తెలుస్తుంది.
- “ప్రణాళిక ప్రకారం జీవిస్తే జీవించినట్టు, ప్రణాళిక ప్రకారం జీవించకపోతే మరణించినట్టు”
- “జీవితం ఒక కల లాంటిదని తెలుస్తుంది”.
- “భూలోకం రాత్రి – పై లోకం పగలు” అని తెలుస్తుంది.
- “ఇప్పటివరకు తాను జీవించిన విధానం చాలా తప్పు” అని తెలుసుకుంటాడు.
- “మీ వాస్తవానికి మీరే సృష్టికర్తలు, మీ జీవితానికి మీరే కారణం, మరెవ్వరూ కాదు.”
- “మిమ్మల్ని రక్షించడానికి బయట నుంచి ఎవరూ రారు. ప్రతి ఒక్కరూ తమను తాము రక్షించుకోవాలి, తమను తాము ఉద్ధరించుకోవాలి.”

**- బ్రహ్మర్షి తటవర్తి వీర రాఘవరావు**

రూ.60/-

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|